


## లడ్డూల నాణ్యత పెంచాం

### -నాణ్యత నెయ్యితో మరింత రుచికరంగా తయారీ: ఇఓ శ్యామలరావు



తిరుమల,జులై 23ప్రభాతవార్తప్రతినిధి: వేంకటేశ్వరస్వామి దర్శనమ్ తరువాత భక్తులు ప్రియంగా స్వీకరించే లడ్డూప్రసాదాల నాణ్యత పెరిగిందని టిటిడి ఈఓ జె.శ్యామలరావు వెల్లడించారు. ఇందుకోసం నాణ్యత ఉన్న నెయ్యిని వినియోగిస్తున్నామన్నారు. నూతన ప్రయోగాత్మకంగా అత్యంత నాణ్యతతో ఉన్న నెయ్యి తెప్పించుకుని లడ్డూలు తయారుచేసి,వాటి రుచి అద్భుతంగా ఉన్నాయన్నారు. నాణ్యతలేని నెయ్యి సరఫరా చేస్తున్న గుత్తేదారలపై చర్యలకు ఉపక్రమించామన్నారు. రానున్న రోజుల్లో నెయ్యిని నాణ్యతా ప్రమాణాలు ఉన్న డైరీల నుండి తెప్పించుకునేలా చూస్తామన్నారు. శ్రీవారి లడ్డూప్రసాదాల నాణ్యత,రుచి పెంపుపై మంగళవారం సాయంత్రంతిరుమలలోని గోకులం అతిధిగృహంలో ఈఓ శ్యామలరావు మీడియాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒ లడ్డూల నాణ్యత, తయారీకి వినియోగించే నెయ్యి సరఫరా అంశాలపై వివరించారు.

### తూపిలిపాలెం బీచ్‌లో

## పర్యాటక అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్



తిరుపతి కార్పొరేషన్, జులై 23, ప్రభాతవార్త తూపిలిపాలెం బీచ్‌లో పర్యాటక అభివృద్ధికి త్వరితగతిన భూమిని పర్యాటక శాఖకు అప్పగించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత రెవెన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ చాంబర్‌లో కలెక్టర్ గూడూరు డివిజన్ నందలి వాకాడు మండలం తూపిలిపాలెం బీచ్‌ను పర్యాటకంగా అభివృద్ధి పరిచేందుకు రిసార్ట్స్ కొరకు అందుబాటులోకి 6.50 ఎకరాల భూమిని నిబంధనల మేరకు పర్యాటక శాఖకు అప్పగించే విధంగా చర్యలు చేపట్టాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. జిల్లా పర్యటక శాఖ అధికారి రూపేంద్ర నాథ్ రెడ్డి కలెక్టర్‌కు వివరిస్తూ రిసార్ట్స్ ఏర్పాటుకు, వాటర్ స్పోర్ట్స్‌కు చర్యలు తీసుకోనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ సిబ్బంది ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర బడ్జెట్‌లో

## రాష్ట్రానికి వరాలు

### - హర్షం వ్యక్తం చేసిన ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు



చిత్తూరు, జులై 23 ప్రభాతవార్త: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వరాల జల్లు కురిపించడంపై ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు హర్షం వెలిబుచ్చారు. సిఎం నారా చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వంతో పోరాడి ఒప్పించడం వల్లే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. పార్లమెంటులో మంగళవారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ రాష్ట్రానికి ప్రత్యేక సహాయం చేయనున్నట్లు ప్రకటించారన్నారు. అలాగే రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తోందని బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి పేర్కొనడం సంతోషదగ్గ విషయమన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న ప్రతి అంశంను అమలుకు చర్యలు తీసుకుంటామని బడ్జెట్ సందర్భంగా మంత్రి పేర్కొనడం హర్షించదగ్గ విషయమన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరాలనికి రాష్ట్ర రాజధాని నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌లో 15 వేల కోట్ల రూపాయలు కేటాస్తున్నట్లు చెప్పడం అభినందనీయమని ఎంపి పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తికి సహాయ సహకారాలు అందించడంతో పాటు దీనికి కేంద్ర బడ్జెట్‌లో స్థానం కల్పించడం ప్రధాని నరేంద్రమోడి ప్రజా పాలనకు నిదర్శనమన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యత ఇవ్వడంపై ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ప్రధాన మంత్రి నరేంద్రమోడి, కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

### ఆగస్టు15 నాటికల్లా

## అన్నా క్యాంటీన్లు

### ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశం



వర్చువల్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి కార్పొరేషన్, జులై 23, ప్రభాతవార్త పేదలకు నామ మాత్రపు ధరతో ఆకలి తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతమైన ఆశయానికి అనుగుణంగా అన్నా క్యాంటీన్‌లను జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలోని మున్సిపల్ పరిధిలో ఆగస్టు 15 నుండి తప్పక ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల కమిషనర్లతో గూగుల్ మీట్ నిర్వహించి వర్చువల్ విధానంలో కమిషనర్లతో మాట్లాడుతూ ఆగస్టు 15 నాటికి జిల్లాలో 11 అన్నా క్యాంటీన్లు ప్రారంభం కావా లని ఆదేశించారు. తిరుపతిలో 4 క్యాంటీన్లు ఎం ఆర్‌పల్లి, ఈఎస్‌ఐ ఆసుపత్రి సమీపంలో, నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్స్, న్యూ బాలాజీ కాలనీలలో గతంలోని అన్నా క్యాంటీన్ భవనాలను మరమ్మత్తులు పూర్తి చేసి ఈ నెల జూలై 31 నాటికి సిద్ధం చేయాలని సూచించారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటీ నందు 2 క్యాంటీన్లు రామసేతు బ్రిడ్జి వద్ద, ప్రభుత్వ ఆసుపత్రి రోడ్ నందు గుర్తించిన భవనాలు మరమ్మత్తులు ఆగస్టు 10 నాటికి పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అలాగే నాయుడుపేట మున్సిపాలిటీ నందు అన్నా క్యాంటీన్ ఆర్టీసి బస్‌స్టాండ్ సమీపంలోని ఆటో స్టాండ్ వద్ద గుర్తించిన భవనాలు మర మ్మత్తులు పూర్తి చేసి ఆగస్టు 15 నాటికి అందుబాటులోకి తెస్తామని అధికారులు తెలిపారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీలో కళాక్షేత్రం ఎదురుగా, గాండ్ల వీధిలో గుర్తించిన భవనం మరమ్మతులు ఆగస్టు 5 నాటికి పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేస్తామని అధికారులు తెలిపారు. వర్చువల్ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, ఏడు మున్సిపాలిటీల మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సెక్షన్ డిటి శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

### తడ వద్ద తమిళనాడు

## రేషన్ బియ్యం పట్టివేత



తడ, జూలై 23 ప్రభాతవార్త తడ వద్ద మంగళవారం తమిళనాడు ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోతుండటంతో పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. తమిళనాడు నుంచి తడ మీదుగా జాతీయ రహదారిపై వెళుతున్న రెండు మినీలారీలలో 201 బస్తాల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వీటి విలువ 2లక్షల 37 వేల 600 రూపాయలు ఉంటుందన్నారు. చెన్నైకి చెందిన సతీష్ ద్వారా అక్కడ ఇళ్లకు వెళ్లి చౌకబియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి వీటిని తరలిస్తున్నట్లు భావిస్తున్నారు. ముత్తు, బి.దొరై అనే ఇద్దరు డ్రైవర్లను గుర్తించామని, వీరిలో ఒకరు పట్టుబడినట్లు చెప్పారు. ఈ అక్రమ బియ్యం తడ కుమార్, వాటంబేడు కుమార్, సూళ్లూరుపేట ప్రతాప్‌నాయుడులకు చేరవేస్తూ తమకు దొరికినట్లు పోలీసులు తెలిపారు. ఆరుగురి మీద కేసు నమోదు చేశారు.

## కుప్పం గడ్డ.. ముఖ్యమంత్రి అడ్డా

### సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి

### ప్రజాస్వామ్యంలో సత్యం.. నిజమే గెలుస్తుంది ..కుప్పానికి మూడు భారీ పరిశ్రమలు తెస్తా!!





కమ్మగుట్టపల్లిలో మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో ప్రసంగిస్తున్న నారా భువనేశ్వరి, హాజరైన మహిళలు

కుప్పం/గుడుపల్లె, జూలై 23 ప్రభాతవార్త కుప్పం గడ్డ ముఖ్యమంత్రి అడ్డా అని ఇక్కడి ప్రజల ప్రేమ, ఆదరణలు తాను మరచిపోనని సిఎం చంద్రబాబునాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. నాలుగు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా మంగళవారం గుడుపల్లె మండలం కమ్మగుట్టపల్లి, గుత్తార్లపల్లి, గుండ్లసాగరం, కోటపల్లి గ్రామాల్లో ఆమె పర్యటించి మహిళలతో, గ్రామస్తులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఎప్పుడూ సత్యం, నిజ ం , నిజాయితీ, ధర్మమే గెలుస్తుందని 2024 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు రుజువు చేశారన్నారు.అరాచకాలు, దౌర జ్న్యాలతో అధికారంలో రావాలనుకున్న వారికి ప్రజలు మౌనంగా ఓటుతో సమాధానం చెప్పారన్నారు. కుప్పం ప్రజలు తమపై ఎన్ని అక్రమ కేసులు వైఎస్సార్సీ నేతలు బనాయించినా, ఎంత వేధించినా, భయ పెట్టినా ఎవరికీ తలొగ్గక ధైర్యంగా నిలబడి తెలుగుదేశం జెండా ఎగరవేశారని పేర్కొన్నారు. నిజ ం గెలవాలి కార్యక్రమంలో భాగంగా కుప్పం వచ్చినపుడు ఇక్కడి మహిళలు తనను ఓ ఆడపడుచులా ఆదరించారని ఆసమయంలో వారు చూపిన ప్రేమాభిమానాలే తనను మరలా ఇక్కడకు తీసుకువచ్చాయన్నారు. తాను ప్రతి రెండు, మూడు నెలలకు ఓ సారి కుప్పం వస్తానని కుప్పం ప్రజల సమస్యలు తెలుసుకుని తాను చేయగలిగిన సాయం చేస్తానని ప్రకటించారు. ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా కుప్పానికి మూడు భారీ పరిశ్రమలు తీసుకువస్తామని ఇక్కడి యువతకు ఇక్కడే ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేలా సిఎం చంద్రబాబును ఒప్పిస్తానని పేర్కొన్నారు. నారా లోకేష్ కుప్పం గడ్డ నుంచే పాదయాత్ర ప్రారంభించారన్నారు. ఆ సమయంలో కుప్పం ప్రజలు ఇచ్చిన ధైర్యం, చూపిన అభిమానంతో లోకేష్ తన పాదయాత్రను ఎన్ని అవాంతరాలు ఎదురైనా నిలబడి, పోరాడి విజయవంతంగా పూర్తి చేశారన్నారు. కుప్పం అభివృద్ధి కార్యక్రమాలపై సిఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు జరుపుతున్నారన్నారు.

#### ఐదేళ్లలో బంగారుకుప్పం చూడబోతున్నాం

**- ఎమ్మెల్సీ డా।। కంచర్ల శ్రీకాంత్**

పేదరికం లేని కుప్పాన్ని సిఎం చంద్రబాబునాయుడు తయారు చేస్తారని రానున్న ఐదేళ్లలో బంగారు కుప్పాన్ని చూడబోతున్నామని ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా।। కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. కంచిబందార్లపల్లి ప్రజలు అదృష్టవంతులన్నారు. చంద్రబాబుకోసం చెమటచిందించి మెజార్టీ తెచ్చారని కృతజ్ఞతలు తెలిపారు. నారా భువనమ్మ కంచిబందార్లపల్లితో పాటు పైపాళ్యం గ్రామాన్ని దత్తత తీసుకునేందుకు ఒక్క సెకను కూడా ఆలోచించలేదన్నారు. ఈ గ్రామాలతో పాటు మిగతా గ్రామాలను కూడా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. సిఎం చంద్రబాబునాయుడు కుప్పం పర్యటనకు రాకముందే ఆరు జిఒలు జారీ చేసి వచ్చారన్నారు. కుప్పం మున్సిపాలిటీకి వంద కోట్లు, పెద్దపంచాయతీలకు రెండుకోట్లు, చిన్న పంచాయతీలకు కోటి రూపాయల వంతున నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. కుప్పంలో డ్రైనేజీల నిర్మాణానికి 86 కోట్లతో ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. ప్రజలు ఎప్పుడూ తెలుగుదేశం పార్టీకే మద్దతు పలుకుతారని పేర్కొన్నారు. అంతకుముందు నారా భువనమ్మ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ముచ్చటించి వారికి చాక్లెట్లు పంచారు. కాగా గ్రామ గ్రామాన భువనమ్మకు మహిళలు మంగళహారతులు పట్టి ఘనంగా స్వాగతించారు. కంచిబందార్లపల్లి గ్రామంలో శ్రీసల్లాపురెమ్మ ఆలయాన్ని దర్శి ంచుకున్నారు. కాగా కంచిబందార్లపల్లి 113 బూత్‌లో అధిక మెజార్టీ రావడంతో బూత్ ఇన్‌చార్జ్ మురుగేష్‌కు మండల టిడిపి అధ్యక్షుడు బాబునాయుడు బంగారు ఉంగరాన్ని నారా భువనమ్మ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ,సమన్వయ కమిటీ ఛైర్మన్ డా।। కంచర్ల శ్రీకాంత్, జిల్లా టిడిపి అధ్యక్షుడు సిఆర్ రాజన్, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, పరిశీలకుడు గాజుల ఖాదర్ బాషా,మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, రాష్ట్ర నేతలు డా।। బిఆర్ సురేష్‌బాబు, గోపీనాథ్, జిఎం రాజు, మండల కన్వీనర్ బాబునాయుడు, బేటప్పనాయుడు, హేమాంబర గౌడు, జనసేన నరేష్, అమీర్, బిజెపి శివశంకర్, మహిళా నేతలు అనసూయ, భాగ్యలక్ష్మి త్రిలోక్, పద్మమ్మ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## గూడూరును నెల్లూరు జిల్లాలో కలపండి

### మంత్రులు నారా లోకేష్, సత్యప్రసాద్‌లకు గూడూరు ఎమ్మెల్యే వినతి



చిట్టమూరు,గూడూరు జూలై 23 ప్రభాతవార్త గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అసెంబ్లీ సమావేశాల అనంతరం మంగళ వారం పలువురు మంత్రులను కలిసి నియోజకవర్గ పరిధిలోని సమస్యలపై వివరించారు. చిట్టమూరు మండల టీడీపీ కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడుతో కలిసి ముందుగా ఎడ్యుకేషన్ సెక్రటేరియల్ కార్యాలయంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌బాబును కలిసి గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని వినతి పత్రం అందజేశారు. గతంలో యువగళం పాదయాత్రలో లోకేష్‌బాబు గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చినట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడితో చర్చించి వీలైనంత త్వరగా గూడూరును నెల్లూరులో కలుపుతామని హామీ ఇచ్చినట్లు ప్రకటన ద్వారా తెలియజేశారు. అలాగే పవన్ కల్యాణ్‌ను కలిసి పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన పలు పనులు పెండింగ్‌లో ఉన్నాయని, కొన్ని కొత్త పనులు మంజూరు చేసి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని వినతిపత్రం అందజేశారు. రెవెన్యూశాఖ మంత్రి సత్యప్రసాద్‌ను కలిసి చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కోసం చిల్లకూరు, కోట మండలాల్లోని రైతుల నుంచి సేకరించిన భూములకు నష్ట పరిహారం అందించాలని వినతిపత్రం అందజేశారు. అలాగే, ఎడ్యుకేషనల్ ప్రిన్సిపల్ సెక్రటరి కోన శశిధర్‌ను కలిసి వివిధ కళాశాలల్లో కాంట్రాక్టు లెక్చరర్లుగా పనిచేస్తున్న వారిని క్రమబద్ధీకరించి ఆదుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే వెంట చిట్టమూరు మండల టిడిపి అధ్యక్షుడు గణపర్తి కిషోర్‌నాయుడు, మైనార్టీ సెల్ సీనియర్ నాయకులు ఎస్‌కె చాంద్‌బాషా ఉన్నారు.

## విస్తృతంగా ఎన్టీఆర్ వైద్య సేవలు

### -కలెక్టర్ సుమిత్‌కుమార్



చిత్తూరు, జులై 23 ప్రభాతవార్త: జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవలను మరింత విస్తృతం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తనిఖీ చేశారు. ఆసుపత్రిలో డయాలసిస్, ఎక్స్ రే, అత్యవసర విభాగం, అవుట్ పేషంట్ వార్డు, పిడియాట్రిక్, గైనిక్ వార్డులను పరిశీలించి కలెక్టర్ సుమిత్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ ఆసుపత్రికి వైద్యం కోసం వస్తున్న రోగులకు అందిస్తున్న వైద్య సేవల్లో భాగంగా ఎంసిహెచ్, రేడియాలజీ విభాగాలను తనిఖీ చేయడం జరిగిందన్నారు. రేడియాలజీ ద్వారా ఎక్స్ రే, అల్ట్రాసౌండ్‌లతో పాటు డయాలసిస్ ద్వారా రోగులకు అందదిస్తున్న సేవలను పరిశీలించామన్నారు. అలాగే కలెక్టర్ ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అపోలో సిబ్బంది ద్వారా మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు, భోజన వసతి, పారిశుధ్యం, ప్రభుత్వం నుండి అందాల్సి న ఆర్థిక సహాయం తదితర అంశాలపై ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ అరుణ్‌కుమార్, ఇతర వైద్యాధికారులతో సమీక్షించారు. ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ అరుణ్‌కుమార్ ఈ సందర్భంగా ఆసుపత్రికి రోజు 1,500 ఓపి కేసులు రావడం జరుగుతున్నదని, యూరాలజీ, న్యూరో సర్జరీ లాంటి సూపర్ స్పెషాలటీ సేవలు అందించడం జరుగుతున్నదన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు అపోలో సిఇఓ నరేష్‌కుమార్‌రెడ్డి, అపోలో మెడికల్ సూపరిటెండెంట్ డాక్టర్ రంగనాథ్, ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ సంధ్య, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నత్తనడకన ప్రసన్న వరదరాజస్వామి ఆలయ పనులు

### కార్మికులు, రాయి సమస్యతో సాగుతున్న పనులు - నాలుగేళ్ళుగా వార్షిక బ్రహ్మోత్సవాలు లేవు.

**శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ప్రసన్నవరదరాజస్వామి ఆలయ నిర్మాణ పనులు అర్హత లేని కాంట్రాక్టర్‌కు అప్పగించటంతో నత్తనడకను మరిపిస్తున్నాయి. నాలుగేళ్ళుగా సాగుతూనే ఉన్న ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు జరగని వైనం. మొత్తం 15 లేయర్ల పనుల్లో నాలుగేళ్ళుగా పూర్తి చేసింది 6 లేయర్లు, మరో లేయర్‌కు సంబంధించి రాయి అందుబాటులో ఉంది. ఇంకా ఏడు లేయర్లకు సంబంధించి రాయి కావాల్సి ఉంది. ఇక్కడి ఆలయ నిర్మాణానికి కుప్పం క్వారీల నుంచి రాయిని రప్పించారు. కొంత కాలం కాంట్రాక్టర్ నిర్లక్ష్యం. క్వారీలకు సొమ్ములు చెల్లించక పోవటంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ప్రస్తుతం కార్మికుల సమస్య వెంటాడుతుంది. రూ.7కోట్లతో చేపట్టిన పనుల్లో పని చేస్తున్న కార్మికులు 6 మంది. ఓ చిన్న ఇంటిని పూర్తి చేయాలంటే రోజూ కనీసం పది మందికార్మికులు పని చేస్తారు అలాంటిది ఓ పెద్ద దేవాలయం నిర్మాణంలో 6మంది కార్మికులు పని చేస్తున్నారంటే ఈ ఆలయం నిర్మాణం ఎప్పటికి పూర్తి అగునో..**



పునాదుల స్థాయికే పరిమితమైన ప్రసన్న వరదరాజస్వామి ఆలయం

శ్రీకాళహస్తి,జూన్ 23 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయం సారధ్యంలో గత పాలకులు పోలోమని అభివృద్ధి పనులంటూ ఉన్న కట్టడాలను కూల్చి కొత్త కట్టడాలకు శ్రీకారం చుట్టారు.మాస్టర్ ప్లాన్ అమలుకు సంబంధించి పట్టించుకొని పాలకులు దేవాదాయశాఖ నిధులను మంచినీళ్ళ ప్రాయంగా కేటాయించిన పాలకులు ఆ పనులను పూర్తి చేయించటంలో వెనుబడ్డారు.కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవటంతో మొండిగోడలు దర్శనమి స్తున్నాయి. అవసరం లేని పనులకు లక్షలకు లక్షలు కేటాయించారు.రూ.34లక్షలు అస్మదీయ కాంట్రాక్టర్ చెల్లించి ఏడాదిన్నరగా ప్రారంభించక తాళాలు తగిలించిన దృశ్యాలు చర్చనీయాంశంగా మారింది.

#### రూ.100 కోట్లు చెల్లించారు.గాలికి వదిలారు:

శ్రీకాళహస్తీశ్వరాలయం రూపు రేఖలు తీర్చి దిద్దాలని మరో పాతికేళ్ళకు వచ్చే భక్తుల సౌకర్యాల కల్పనకు 2016-17లో నారాచంద్రబాబునాయుడు ఆదేశాలతో మాస్టర్ ప్లాన్‌ను రూపకల్పన చేసారు.ఇందుకు 3.54 ఎకరాల భూసేకరణ గావించారు.సుమారు 125ఇళ్ళను స్వాధీనం చేసుకున్నారు.ఇందుకు రూ.100కోట్లు వెచ్చించారు. మొదటి దశ పనులకు 84కోట్లతో టెండర్లను సిద్దం చేసారు. 2019 ఎన్నికల్లో ప్రభుత్వం మారింది. అన్ని రివర్స్ అయ్యాయి. అందులో శ్రీకాళహస్తీశ్వరుని మాస్టర్ ప్లాన్‌కూడా మరో 'కన్సల్టెన్సికి' అప్పగించారు. ఐదేళ్ళ పాటు ఆ కన్సల్టెన్సి పరిశీలనలకే పరిమితమైంది. దాంతో శ్రీకాళహస్తీశ్వరుని మాస్టర్ ప్లాన్ అమలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు మారింది.

#### మూడేళ్ళలో రూ.కోట్ల పనులు: మాస్టర్ ప్లాన్ మూలకు:

శ్రీకాళహస్తీశ్వరాలయం మూడేళ్ళలో రూ.కోట్ల పనులు చేపట్టారు. పనులన్నీ టెండర్ల ముసుగులో అస్మదీయులకు పంచిపెట్టారు.శివయ్య నిధులను పప్పు బెల్లాల్లా ఒకరిద్దరు కంట్రాక్టర్ల ముసుగులో దండుకున్నారు. పోలో మని పనులు చేసారు.అయితే మాస్టర్ ప్లాన్‌కు సంబంధించిన పనుల గురించి 'కన్సల్టెన్సి' ముసుగుతో ప్రభుత్వం ఐదేళ్ళ పాటు కాలయాపన చేసింది. రాష్ట్రంలోని ఏ దేవాలయంలో కూడా అభివృద్ధి పనులు చేపట్టలేదు. ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయం సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దటానికి రూపకల్పన చేసిన మాస్టర్ ప్లాన్‌మూల పడింది.

#### మొండిగోడలతో దర్శన మిస్తున్న అభివృద్ధి:

శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన శిల్పి పనులను గత పాలకులు అస్మదీయులకు అందించారు. పట్టణ నడిబొడ్డులో ఉన్న కట్టడాలు దిష్టిబొమ్మల్లా దర్శన మిస్తుంటే పరిశీలకులు చర్చించుకుంటున్నారు.శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన బిక్షాలగాలిగోపురం సమీపంలో వాహనాల మండపం పదేళ్ళుగా సాగుతూనే ఉంది. అయితే ఆ కాంట్రాక్టర్‌పై ఇంజనీరింగ్‌శాఖ ఎలాంటి చర్యలు తీసుకోదు. కారణమేమిటో ముక్కంటీశునికే ఎరుక. ఇక మొదట రూ.నాలుగుకోట్ల ప్రతిపాదనలతో ప్రారంభమై రూ.7కోట్లతో టెండర్లు పిలిచిన పనులను ఓ కాంట్రాక్టర్ పేరుతో ఏ మాత్రం అనుభవం లేని ఓ ఆస్మదీయునికి అప్పగించారు.మూడేళ్ళు దాటుతున్న పనులు పునాదుల స్థాయి దాటలేదు. అలాగే సుబ్రమణ్యం స్వామి కొండ ఆధునీకరణ పనులు రూ.3కోట్లతో చేపట్టారు. పిల్లర్లకే పరిమితవమైంది. ఇక కుమారస్వామి కొండ దిగువన వినాయక మండపాన్ని ఆధునీకరించాలనే లక్ష్యంతో ఉన్న మండపాన్ని పడగొట్టారు.కానీ పనులు పూర్తి కాలేదు. అక్కడ సేకరించిన ఇళ్ళ వారికి నష్టపరిహారాలు చెల్లించలేదు.ఇక ముత్యాలమ్మగుడివీధిలోని ఏడుగంగమ్మల ఆలయ గర్భగుడి పునర్నిర్మాణం పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఇక రూ.18కోట్లు వెచ్చించి కైలాసగిరి చుట్టూ సిమెంటు రోడ్డు పనుల అంటూ చెబుతున్నారు.కానీ ఇక సుమారు 6 కిలోమీటర్ల రోడ్డును వేయాల్సి ఉంది.

## పరిశుభ్ర నీటి సరఫరాకు చర్యలు

పాలసముద్రం, జులై 23 ప్రభాతవార్త:

గ్రామాల్లో పరిశుభ్ర మంచినీటి సరఫరాకు పక్కాగా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓ ఇఓఆర్డీ రమేష్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఇఓఆర్డీ రమేష్ మంగళవారం మండలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా బాలకృష్ణాపురం పంచాయతీలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా మంచినీటి వనరులు కాలుష్యం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో స్వచ్ఛమైన మంచినీటిని సరఫరా చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. అలాగే వ్యాధులు ప్రబలకుండా దోమలను కట్టడి చేయడానికి పంచాయతీ స్థాయిలో విస్తృతంగా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య పనులు పర్యవేక్షించడానికి మండల స్థాయిలో ప్రత్యేక విభాగంను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రత్యేక పారిశుధ్య పనుల నిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇఓఆర్డీ రమేష్ హెచ్చరించారు.

## ఫైనాన్స్ లిటరసీపై అవగాహన

పాలసముద్రం, జులై 23 ప్రభాతవార్త:

ప్రతి ఒక్కరు ఫైనాన్స్ లిటరసీపై అవగాహన పెంచుకొని ఆర్థికంగా ముందడుగు వేయాలని సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో మహిళలకు ఫైనాన్స్ లిటరసీపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ బ్యాంకు ద్వారా ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన పథకం అమలు అవుతుందని ఈ పథకంకు 18-70 వయస్సు మధ్య వున్న వారు అర్హులని పేర్కొన్నారు. అలాగే ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి యోజన పథకం ద్వారా ఏదైనా కారణంతో ఎవరైనా మృతి చెందితే ఈ పథకం వారి కుటుంబ సభ్యులకు రక్షణ అందిస్తుందన్నారు. ఈ పథకాలు బ్యాంకులు, పోస్టాఫీసుల ద్వారా అమలు అవుతున్నాయని, ఈ పథకాలు జీవిత బీమా కంపెనీల ద్వారా నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే అటల్ పెన్షన్ యోజన పథకం ప్రతి ఒక్కరికి సామాజిక భద్రతను కల్పిస్తుందన్నారు. పౌరులందరికీ 60 సంవత్సరాల అనంతరం స్థిరమైన ఆదాయం అందించడం ఈ పథకం లక్ష్యమన్నారు. ఈ పథకం నేషనల్ పెన్షన్ స్కీమ్ ఫ్రేమ్ వర్క్ ఆధారంగా రూపొందించడం జరిగిందన్నారు.

## నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తాం



– జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

వి.కోట, జులై 23 ప్రభాతవార్త

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. మంగళవారం వి.కోట పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా కేసుల వివరాలు, రికార్డులు పరిశీలించారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్ కేసులను త్వరగా క్లియర్ చేయాలని ఆదేశించారు. ఎన్‌బిడబ్ల్యు వారెంట్లు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. కేసులకు సంబంధించి సకాలంలో చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. స్కూళ్లు, కాలేజీలు, లాడ్జీలు, హోటళ్ల వద్ద నిఘా ఏర్పాటుచేయాలన్నారు. రాత్రిపూట గస్తీ పటిష్టం చేయాలని ఆదేశించారు. రౌడీ షీటర్ల నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో సిఐ లింగప్ప, ఎస్సై బాబు పాల్గొన్నారు.

## అందుబాటులో పాడి రైతుల వివరాలు

– కలెక్టర్ సుమిత్‌కుమార్



**చిత్తూరు, జులై 23 ప్రభాతవార్త:** పశు వైద్యశాలల పరిధిలో పశు సందప కల్గిన పాడి రైతుల వివరాలను అందు బాటులో వుంచుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పశువైద్య అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం స్థానిక బహువిధ ప్రభుత్వ వైద్యశాల, ప్రాంతీయ పశు నిర్ధారణ ప్రయోగశాల కార్యాలయాలను తనిఖీ చేసి సంబంధిత పశు వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో పశు వైద్యశాఖలో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరు ఎపి ఎఫ్ఆర్ఎస్ యాప్, పశుసంవర్ధక యాప్ నందు హాజరు నమోదు చేయాలన్నారు. ప్రతి సహాయ సంచాలకులు డాక్టర్ల పనితీరుపై వారాంతపు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. వెటర్నరీ అసిస్టెంట్లపై వీలైనంత త్వరగా సమావేశం ఏర్పాటు చేయాలని వారు నిర్వహిస్తున్న విధులపై సమీక్షించడం జరుగుతుందన్నారు. పశు వైద్యంకు సంబంధించి ప్రతి వారం చికిత్స వివరాలను సమర్పించాలని స్పష్టం చేశారు. స్థానిక వీధి కుక్కలను కట్టడి చేయడానికి వినూత్నంగా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని పశుసంవర్ధకశాఖ జెడి డాక్టర్ ప్రభాకర్, మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణలను ఆదేశించారు. పశుసంవర్ధకశా జెడి డాక్టర్ ప్రభాకర్ కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వివరిస్తూ జిల్లాలో 14 పశు వైద్యశాలలు వున్నాయని, 14 మంది సహాయ సంచాలకులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. అలాగే 68 మంది వెటర్నరీ డాక్టర్లు వున్నారని, అలాగే 77 మంది పారా వెటర్నరీ సిబ్బంది, 282 వెటర్నరీ అసిస్టెంట్లు వున్నారన్నారు. పశుసంవర్ధకశాఖ డిడి సుబ్బమ్మ, బహువిధ పశు వైద్యశాల, స్థానిక పశువైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కుక్కలున్నాయి పిక్కలు జాగ్రత్త...!

–ఆందోళనలో పట్టణ వాసులు

చౌడేపల్లి, జూలై 23 ప్రభాతవార్త



మండల కేంద్రమైన చౌడేపల్లిలో రోజురోజుకూ కుక్కల బెడద అధికమవుతోంది. బస్టాండు, గాంధీవీధి, బజారువీధి, నేతాజీనగర్, మేదరదొడ్డి, గోసలకురపల్లి తదితర ప్రాంతాల్లో శునకాలు అధికంగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇటీవల కాలంలో పలు చోట్ల శునకాలు చిన్నారులను పొట్టన పెట్టుకొంటున్న విషయం విధితమే. ఈ సంఘటనలు సోషియల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. దీంతో పిల్లలు, వృద్ధులు కుక్కల బెడద వల్ల ఇళ్ళకే పరిమితమవుతున్నారు. ద్విచక్ర వాహనాల్లో వెళ్ళేవారిని శునకాలు వెంబడిస్తూ వెళ్ళి మరీ పిక్కలు పట్టుకొనేందుకు ప్రయత్నిస్తున్నాయి. ప్రభుత్వాసుపత్రి, ప్రాథమిక పాఠశాల, ఉన్నతపాఠశాలల సమీపంలో శునకాలు విచ్చల విడిగా సంచరిస్తుండటంతో మహిళలు, పిల్లలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ప్రమాదం సంభవించక ముందే స్పందించి కుక్కల బారినుంచి పట్టణవాసులకు విముక్తి కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

## 28న చౌడేపల్లిలో ఆడికృత్తిక

చౌడేపల్లి, జూలై 23 ప్రభాతవార్త

స్థానిక మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ ఆవరణంలోని వల్లీ, దేవసేన సమేత షణ్ముఖ సుబ్రమణ్యస్వామికి ఈనెల 28న ఆడికృత్తిక కావిళ్ళ చెల్లింపు వుంటుందని ఇఓ కమలాకర్‌రావు, ప్రధానార్చకుడు రాజశేఖర్ దీక్షితులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28న భరణి, 29న కృతిక కావిళ్ళు చెల్లించే అవకాశముందన్నారు. అదే విధంగా కళ్యాణోత్సవం, నెమలి వాహనంపై ఊరేగింపు వుంటుందన్నారు. భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

పాకాల, జులై 23, ప్రభాతవార్త

పాకాల మండలం, ఉప్పరపల్లి పంచాయితీ, ఊట్లవారిపల్లి ఆనందగిరి పై వెలిసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యంస్వామి వారి బ్రహ్మోత్సవాలను వైభవంగా జరిపించేందుకు చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని ఇప్పటికే మూడు సార్లు అధికారులతో సమావేశం అయ్యారు. ఆలయ బ్రహ్మోత్సవాలు వాల్ పోస్టర్, నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఇతర శాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాలగంగాధర్ తిలక్‌జయంతి.



పెద్దపంజాణి జూలై 23 ప్రభాతవార్త :

స్వాతంత్ర సమరయోధుడు స్వరాజ్యం నాజన్మ హక్కుఅని చాటిచెప్పిన మహనీయుడు బాలగంగాధర తిలక్ జయంతిని నాగిరెడ్డిపల్లి యుపీ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బాబు రెడ్డి మాట్లాడుతూ.. ఆంగ్లేయుల గుండెల్లో పోరాటాలతోపాటు తన రచనలు, కవితలతో రైళ్ళు పరిగెత్తిచ్చిన పోరాటయోధుడు తిలక్‌అని పేర్కొన్నారు. పేద బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన తిలక్ పదహారేళ్ళ వయసులోనే తండ్రిని కోల్పోగా అనతరం అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని ఆంగ్లేయుపై స్వాతంత్రపోరాటం చేసి సఫలీకృతమయ్యారని పేర్కొన్నారు. విదార్థులు ఇలాంటిమహనీయుల బాటలో పయనించి దేశ అభివృద్ధి సమగ్రతకు పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మీనాక్షి, వాణిశ్రీ, అంజప్ప, రాజేష్‌బాబు, మాధవన్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సబ్‌జూనియర్‌బాల్ జట్టు ఎంపిక.

కుప్పంరూరల్, జూలై 23 ప్రభాతవార్త :

సబ్‌జూనియర్ షూటింగ్ బాల్‌జట్టును ఈనెల 28న కుప్పంలోని డా॥అంబేద్కర్ గురుకులంలో ఎంపిక చేయనున్నట్లు షూటింగ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్ తెలిపారు. క్రీడాకారులు ౹2008 తరువాత పుట్టినవారై ఉండాలన్నారు. నిస్వార్థులైన పిడిల సమక్షంలో జట్లను ఎంపిక చేయడం జరుగుతుంన్నారు. వివరాలకు 6301831236 నెంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ పవన్‌కళ్యాన్, కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి సెల్వం, వైస్ ప్రెసిడెంట్ లోకనాథం, రమణారెడ్డి, జబీర్, పి.ఈటీలు స్వాతి, జమున, సబిత పాల్గొన్నారు.



# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మామిడి కోత అనంతరం యాజమాన్య పద్ధతులు చేపట్టాలి



–జిల్లా ఉద్యాన అధికారి

ఐరాల, జులై 23 ప్రభాతవార్త:

మామిడి తోటల్లో కాయల కోత అనంతరం యాజామాన్య పద్దతులు తప్పనిసరిగా పాటించినట్లయితే అధిక దిగుబడి సాధించ వచ్చునని జిల్లా ఉద్యాన అధికారి డి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని 35 యర్లంపల్లె, దివిటివారిపల్లె గ్రామ రైతులకు రైతు సుధాకర్ మామిడి తోటలో రైతులకు మామిడి తోటల్లో కాయల కోత అనంతరం చేపట్టవలసిన యాజమాన్య పద్దతులపై ఆచరనాత్మక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ఉద్యాన అధికారి మదుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ మామిడితోటల్లో కాయల కోత అనంతరం తప్పనిసరిగా కొమ్మ కత్తిరింపులు చేపట్టాలని సూచించారు. చెట్టు మొదలుకు ఎండ సోకేలా అడ్డదిడ్డంగా వున్న కొమ్మలను, ఎండిన కొమ్మలను కత్తిరించాలని సూచించారు. అలాగే కొమ్మల కత్తిరింపుల అనంతరం శాస్త్రవేత్తల సూచనలు సలహాల మేరకు తగిన మోతాదులో పశువుల ఎరువులు వేసి నీరు పెట్టాలని సూచించారు. అలాగే మామిడి పంటలో పచ్చరొట్ట పంటలైవ ఉలవలు, అలసందలు, జనుము, జీలుగ, పిల్ల పెసర వంటి పంటలను పెంచి కలియ దున్నాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏపీఎంఐపీ పథక సంచాలకులు బాలసుబ్రమణ్యం, ఉపసంచాలకులు పజులున్నీషా, మండల ఉద్యాన అధికారి డి.సాగరిక, స్థానిక సర్పంచ్ మల్లీశ్వరి, రైతు నాయకులు ఎబ్బూరి వేణుగోపాల్, నాయకులు సుధాకర్, సుబ్రమణ్యం, శ్రీనివాసులు, వాసుదేవరెడ్డి, చిట్టిబాబు, వీరభద్ర, రాజేష్‌రెడ్డి, లోకనాధరెడ్డిలతో పాటు మామిడి రైతులు పాల్గొన్నారు.

## అరగొండలో అంటువ్యాధుల నియంత్రణ అవగాహన ర్యాలీ

తవణంపల్లె, జూలై 23 ప్రభాతవార్త:



మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ అరగొండలో మంగళవారం ఉధృత అతిసార నియంత్రణ మాసోత్సవల సందర్భంగా మండల వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల వైద్యాధి కారులు డాక్టర్ ప్రియాంక,, టీఎస్. మోహన్‌వే లుల అధ్వర్యంలో పంచాయతీ వైద్యసిబ్బంది స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలసి డెంగ్యూ, ఉధృత అతిసార వ్యాధులపై గ్రామ పురవీదుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా దోమ చిన్నది, రోగం పెద్దది, 'ప్రతి శుక్రవారం డ్రైడే పాటిద్దాం' దోమ తెరలు వాడుదాం, దోమలు పుట్టకుండా, కుట్టకుండా చేద్దాం. వేపాకు పొగ దోమలకు సెగ 'అతిసారకు మూలం బహిరంగ మల విసర్జన' అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, ఆరోగ్య కార్యకర్త సుబ్రమణ్యంరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులను పరిశీలించిన డ్వామా పీడీ

తవణంపల్లె, జూలై 23ప్రభాతవార్త:



మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను డ్వామా పీడీ ఎన్, రాజశేఖర్ మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా మండలలోని కారకాంపల్లె గ్రామ పంచాయతీలో జరుగుతున్న కాలువ పనులను తనిఖీ చేసి అక్కడి కూలీలతో మాట్లాడారు. వేతనాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని ఉపాధి దినసరి వేతనం ఎంత వస్తుంది? గ్రామంలో ఇంకా ఏమైనా పనులు కావాలా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈచనేరి గ్రామంలో నిర్వహిస్తున్న డ్వామా నర్సరీని పరిశీలించారు. అనంతరం మండలంలోని ప్రతి గ్రామపంచాయతీలో ఉన్నటువంటి కూలీలకు ఉపాధి హామీ పనులను కల్పించాలని, అమృథ్ సరోవర్, మినీ అమృత్ సరోవర్ పనులను గుర్తించి పనులను వేగవంతం చేయాలని పీడీ రాజశేఖర్ ఉపాదిహామీ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో క్లస్టర్ ఏపీడీ బి.సుబ్రమణ్యం, పీల్డ్ అసిస్టెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ప్రభుత్వాసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

– రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రికి వినతి

కోట, జూలై 23 ప్రభాతవార్త



గూడూరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వాసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కి కోట, వాకాడు మండలాలకు చెందిన బిజెపి నాయకులు విజయవాడలో వినతిపత్రం అందజేశారు. గూడూరు డివిజన్‌లో త్వరలోనే పర్యటన ఉందని, ఈ క్రమంలో గూడూరు డివిజన్‌లోని అన్ని ఆసుపత్రులను పరిశీలిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు కోటేశ్వరరావు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో గూడూరు నియోజకవర్గం బిజెపి ఇన్‌ఛార్జ్ పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, దువ్వూరు గిరిధర్‌రెడ్డి, పాదర్తి కోటారెడ్డి తదితరులు ఉన్నారు.

## ప్రజారోగ్యాన్ని కాపాడండి

కోట, జూలై 23 ప్రభాతవార్త



వర్షాకాలంలో అంటువ్యాధుల బెడద ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తుందని, ఇందులో పంచాయతీ కార్యదర్శులు కీలకపాత్ర పోషించాలని డిఎల్‌పిఓ వెంకటరమణ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎంఆర్‌సి భవనంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మండలంలో ఎక్కడైనా పంచాయతీ పైపులైన్లు మరమ్మతులకు గురయితే వెంటనే సకాలంలో బాగు చేయించి ప్రజలకు సురక్షితమైన జలాలను అందించాలని కోరారు. అదేవిధంగా హ్యాండ్‌బోర్డు ప్లాట్‌ఫారాలపైన చెత్తాచెదారాలు తొలగించాలని సూచించారు. వాటర్ ట్యాంకుల్లో బ్లీచింగ్ చల్లాలని సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీలు ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. రోడ్లపైన, కాలువల్లో చెత్తాచెదారం నిల్వ లేకుండా చూడాలని కోరారు. ఇటీవల కాలంలో అతిసార తీవ్రమవుతుందని, పారిశుధ్య పరిరక్షణ కీలకమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం

కోట, జూలై 23 ప్రభాతవార్త



కోట మండలం గూడలి జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాలికా విద్య, లైంగిక వేధిం పులు తదితర విషయాలపై బాలికలకు వివరించా రు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పారవోలులో పారిశుద్ధ్య పనులు చేపట్టిన పంచాయితీ

వెంకటగిరి, జులై 23, ప్రభాతవవార్త



వర్షాకాలం సందర్భంగా గ్రామంలో అంటు వ్యాధులు ప్రబలకకుండా పంచాయితీ సిబ్బంది పారిశుద్ధ్య పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో ఉన్న మురికి కాలువలో చెత్తాచెదారంను తొలగించి బ్లీచింగ్ చల్లారు. తాగునీరు వల్ల వ్యాధులు ప్రబలకుండా క్లోరినేషన్ చేశారు.

## అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్లు పట్టివేత

**నాయుడుపేట, జులై 23 ప్రభాతవార్త** నాయుడుపేట మండలం అయ్యప్పరెడ్డిపాలెం వద్ద స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. సోమవారం అర్ధరాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని నాయుడుపేట పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ గోపి ఆధ్వరనయంలో పోలీసు సిబ్బంది అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఆరు ట్రాక్టర్లను పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వం ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న పోలీసు అధికారులపై నాయుడుపేట మండల ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## భాష, గణిత అభ్యసన సామర్థ్యం పెంపుకు విద్యార్థులకు అవగాహన

వెంకటగిరి, జులై 23, ప్రభాతవార్త




శిక్ష సత్తాహ్ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు జడ్పి బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు భాష అభ్యసన ,గణితం పై సామర్థ్యం పెంచే కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు నిర్వహించారు. నూతన విద్యా విధానంలో భాగంగా 9 నుంచి 14 సంవత్సరాల పిల్లలకు కిందస్థాయి నుంచి అభ్యసన సామర్థ్యం పెంపొందించడం వివిధ సంభాషణలు ఆంగ్లము, గణితంలో ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థులు నృత్య ప్రదర్శనలు నిర్వహించారు.

## విద్యార్థులు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలి

శంషాద్ బేగం

బాలయపల్లి, జులై 23, ప్రభాతవార్త



విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు తప్పనిసరిగా పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సిడిపిఓ శంషాద్ బేగం సూచించారు. నిడిగల్లు జడ్పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రత పై అవగాహన నిర్వహించారు. ఆకుకూరలు, కోడిగుడ్లు వంటి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే అంటువ్యాధులు ప్రబలకుండా ఉంటుందని తెలిపారు. ఇంటి ఆవరణలో మురుగునీరు ఉండకుండా చూసుకోవాలని సూచించారు. డయేరియా నిర్మూలనపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా కలెక్టర్‌కి శుభాకాంక్షలు తెలియజేసిన

ప్రజా సంఘాల ఐక్య వేదిక అధ్యక్షులు గద్దల మునెయ్య

వెంకటగిరి, జులై 23, ప్రభాతవార్త



నూతన జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌ని కలెక్టర్ కార్యాలయం చాంబర్ నందు ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు గద్దల మునయ్య కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువతో సత్కరిస్తూ పూల బొకే అందజేశారు. ఈ సందర్భంగా గద్దల మునెయ్య కలెక్టర్‌తో మాట్లాడుతూ వెంకటగిరి నియోజకవర్గంలోని దళిత గిరిజనుల సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. ఆయన వెంట ఏపి ప్రజా సంఘాల ఐక్యవేదిక వెంకటగిరి నియోజకవర్గ ఇన్చార్జి ఎస్‌కె రఫీ ఉన్నారు.

## రాష్ట్ర అభివృద్ధి సిఎం చంద్రబాబు నాయుడుతోనే సాధ్యం

ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జులై 23, ప్రభాతవార్త



సిఎం చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్లో రాష్ట్రానికి భారీగా నిధులు కేటాయించడం సిఎం చంద్రబాబు నాయుడు చొరవేనని ఆయన తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించడం హర్షించదగ్గ విషయం అన్నారు. అమరావతి అభివృద్ధికి 15 వేల కోట్ల రూపాయిలు నిధులు కేటాయించడం ఆనందంగా ఉందన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు 24 గంటలు రాష్ట్రాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ అన్ని రంగాలకు ప్రాధాన్య ఇచ్చిందని తెలిపారు. పేదల సంక్షేమానికి పెద్ద పీట వేసినట్లు తెలిపారు. కేంద్ర బడ్జెట్ ఆనందంగా ఉందన్నారు.

## కేంద్ర ఆర్థిక మంత్రికి ధన్యవాదాలు

వాకాడు, జులై 23, ప్రభాతవార్త

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్‌కు బిజెపి గూడూరు నియోజకవర్గ కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తమ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేఖరులకు ప్రకటన ద్వారా తెలియజేస్తూ ఆంధ్రప్రదేశ్‌కు భారీగా నిధుల కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఎన్‌డిఏ కూటమి, ప్రభుత్వ హయాంలోనే అమరావతిలో రాజధాని నిర్మాణం, పోలవరం నిర్మాణాలు పూర్తవుతాయన్నారు. ఆ రెండింటికి భారీగా కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించడం హర్షనీయం. వికసిత్ భారత్‌లో భాగంగా వికసిత్ ఆంధ్రప్రదేశ్‌గా ఉంటుందని అన్నారు. రాబోవు రోజుల్లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాలలో అగ్రగామిగా ఉంటుందన్ని పురుషోత్తం రెడ్డి తెలిపారు.

## పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచండి

మాజీ కౌన్సిలర్లు

గూడూరు, జులై 23, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాలని మాజీ కౌన్సిలర్‌లు బిల్లు చెంచు రామయ్య, తాతపూడి ఇశ్రాయేల్ కుమార్‌లు పేర్కొన్నారు. మంగళవారం గూడూరు రెండవ పట్టణంలోని మాళవ్య నగర్ వాటర్ ట్యాంక్ ప్రాంగణంలో 15,16,17 సచివాలయాల పరిధిలోని పారిశుద్ధ్య సిబ్బంది హాజరు కేంద్రానికి వెళ్ళి, సిబ్బంది హాజరు శాతాన్ని తనిఖీ చేసి, వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, డయేరియా లాంటి అంటు వ్యాధులు ప్రబలకుండా, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు పలు సూచనలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాల్వలలోని చెత్తను పూర్తిగా తీసివేయాలని కాలువలలో ఆయిల్ బాల్స్ వేయాలని పారిశుద్ధ్య ఇన్స్పెక్టర్లకు, శానిటరీ సిబ్బందికి ఆదేశాలు చేసారు. ఎమ్మెల్యే డా. పాశం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు గూడూరు పట్టణ ప్రజలు అనారోగ్యానికి గురి కాకుండా గూడూరును పచ్చదనం పరిశుభ్రతగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వీరి వెంట శానిటరీ ఇన్స్‌ఫెక్టర్లు పోలయ్య, రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## వీరభద్రుని ఆలయంలో అన్నదానం

గూడూరు, జులై 23, ప్రభాతవవార్త



గూడూరు పట్టణంలోని వీరభద్రుని ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ తుమ్మూరు మునిమోహన్ మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రతి మంగళవారం క్రమం తప్పకుండా అన్నదాన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. దాతల సహకారం మరువలేనిదన్నారు. దాతలుగా మీను గుల రమాదేవి జ్ఞాపకార్థం డాక్టర్ వెంకట్ అరవింద్ వ్యవహరించారు.

## పాఠశాల్లో వినోదం పంచేలా కార్యక్రమాలు

కోట, జులై 23 ప్రభాతవార్త

విద్యార్థుల్లో సామాజిక కార్యక్రమాల్లోపై అవగాహన కల్పించాలని ఎంఇఓ డి. మస్తానయ్య పిలుపునిచ్చారు. శిక్షా సప్తాహ్ పేరుతో మండలంలోని ప్రాథమిక పాఠశాల్లో జరుగుతున్న కార్యక్రమాలను ఆయన మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కోటలో ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో అమలు చేసే ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమానికి సంబంధించి ఉపాధ్యాయులు బోధనా పద్ధతులు ప్రదర్శించాలన్నారు, క్రీడా దినోత్సవం, నిర్వహించడంతో పాటు విద్యార్థులకు దేశీయ ఆటలు ఆడించడం, ఆటలు కల్ల కలిగే ప్రయోజనాలు వివరించాలన్నారు. సాంస్కృతిక దినోత్సవం నిర్వహించాలి, ఇందులో వివిధ భాషలు ,వేషధారణ, వస్త్ర ధారణ పద్దతులపై అవగాహనల కల్పించాలన్నారు. చిత్రలేఖనం, నృత్యాలు, వేయించి చిన్నారుల్లో ఉత్సాహం నింపాలన్నారు. సాంకేతిక నైపుణ్య దినోత్సవంలో భాగంగా కోడింగ్, ఛాలెంజ్. జీవాధరణ, కార్యక్రమాలు, వృక్ష జంతుల జాలాలపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులతో చారిత్రక స్థలాలను సందర్శించి పలు రకాల వర్క్‌షాపులు నిర్వహించాలన్నారు. స్కూల్ న్యూట్రిషీన్ డే నిర్వహణలో భాగంగా విద్యార్థులతో ఎకో క్లబ్‌లను ఏర్పాటు చేయాలని, క్లబ్‌ల భాగస్వామ్యంతో మొక్కలు పెంపకం, కూరగాయల తోటల పెంపకం, వాటి సంరక్షణ అంశాలను వివరించాలన్నారు. సామాజిక భాగస్వామ్యం దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్య, విద్యేతర అంశాలు, తదితర కార్యక్రమాలపై అందరిని భాగస్వాములను చేయాలన్నారు.

## నేడు ఉచ్చూరులో పశువైద్యశిబిరం

**దొరవారిసత్రం జూలై 23 ప్రభాతవార్త ;** మండలంలోని ఉచ్చూరు గ్రామంలో బుధవారం పశువైద్యశిబిరం నిర్వహించడం జరుగుతుందని వెటర్నరీ డాక్టర్ శ్రీదేవి తెలిపారు. ఈ వైద్యశిబిరానికి ముఖ్యఅతిథిగా తిరుపతి జిల్లా పశువైద్యశాఖ జాయింట్ డైరెక్టర్ రవికుమార్‌తోపాటు డిఎల్‌డిఏ సోమయ్య, వసంతరాయులు పాల్గొనడం జరుగుతుందన్నారు. ఈ పశువైద్యశిబిరంలో ఉచ్చూరుతోపాటు చుట్టు పక్కల గ్రామాల్లో ఉన్న పశువులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్యం అందించడం జరుగుతుదన్నారు. వెటర్నరీఅధికారులుఅందరు తప్పనిసరిగా పాల్గోని వైద్యశిబిరం విజయవంతం చేయాలన్నారు.

## రేపు బీటెక్ డ్యూయల్ డిగ్రీకి కౌన్సెలింగ్

తిరుపతి విద్య, జులై 23, ప్రభాతవార్త

శ్రీ పద్మావతి మహిళావర్సిటీ స్వీడన్‌కు చెందిన బ్లేకింగ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంయుక్తంగా నిర్వహించే బిటెక్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌కు ఈ నెల 25 వ తేది కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. బీటెక్ డ్యూయల్ డిగ్రీలో చేరే విద్యార్థులు మూడేళ్ల పాటు మహిళావర్సిటీలో కోర్సు చదవాల్సి ఉంటుందని, మరో ఏడాది పాటు స్వీడన్‌లోని బ్లేకింగ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో విద్యనభ్యసించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇంటర్‌లో 70 శాతం మార్కులు సాధించి, ఏపీ ఈఏపి సెట్ - 2024లో అర్హత సాధించిన మహిళా అభ్యర్థులు ఈ కోర్సుకు అర్హులని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థినులు గురువారం వర్సిటీలోని సావేరి సెమినార్ హాల్‌లో ఉదయం 10 గంటలకు జరిగే కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొనవచ్చని సూచించారు. మరిన్ని వివరాలకు మహిళా వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను కానీ, ఫోన్ నెం. 7995973878 కానీ, సంప్రదించాలని కోరారు.

## తిరుపతి జిల్లా జంప్‌రోప్ బాల బాలికల జట్లు

తిరుపతి విద్య, జులై 23, ప్రభాతవార్త



స్థానిక మంగళంలోని బాలచంద్ర మెమోరియల్ హైస్కూల్‌లో మంగళవారం జిల్లా స్థాయిలో అండర్ 12, అండర్ 14 బాల బాలికలకు జంప్ రోప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు తిరుపతి జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి, 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ ఎంపికకు 1.1.2012వ సంవత్సరం తర్వాత జన్మించిన వారు అండర్ 12 విభాగానికి అర్హులని పేర్కొన్నారు. ఇక్కడ అత్యంత ప్రతిభ కలిగిన క్రీడాకారులను ఎంపిక చేసి, ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 27, 28 తేదీలలో కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి జంప్ రోప్ పోటీలలో పాల్గొంటారని పాఠశాల చైర్మన్ కృష్ణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూనియన్ బ్యాంక్ మేనేజర్ నరేంద్ర మాట్లాడుతూ క్రీడల్లో శారీరక మానసిక ఆరోగ్యానికి దోహదపడతాయని తెలిపారు. కేశవులు నాయుడు మంగళం జడ్పి హెచ్ఎస్, హెడ్మాస్టర్ మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అవ్వాలని ఆకాంక్షించారు. సాంబశి (జంప్ రోప్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి) జంపు రోప్ ప్రాచీన క్రీడ అని ఆధునిక సమాజంలో కొన్ని మార్పులతో టెక్నాలజీని జోడించి జంపు రోప్ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా బిసిఎం స్కూల్ కరస్పాండెంట్ ప్రియ, ప్రిన్సిపాల్ సుకన్య, వివిధ పాఠశాలల పిఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ టీమ్ ఆకస్మిక తనిఖీలు

పాకాల, జులై 23, ప్రభాతవార్త



పాకాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమిరెడ్డి పల్లి సచివాలయంలో డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ టీమ్ విజిట్ చేసారు. డిపిఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు సూచనలు మేరకు నాగేంద్ర కుమార్ ఎస్ఓ, ప్రకాష్, బేబీరాణి అన్ని రికార్డులను పరిశీలించి, హెచ్ఎంఐఎస్ డేటా పై వివరింగా ఆశాలకు తెలిపారు. ఈ కార్యక్ర మంలో డా. మురళీకృష్ణ, సూపర్వైజర్ రమణ, భగవతి, అయ్యప్ప, ఎంఎల్‌హెచ్‌పిఎస్, ఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

## హత్యయత్నం కేసులో ముగ్గురు అరెస్టు

పుత్తూరు, జూలై 23 ప్రభాతవార్త :



వెదురుకుప్పం మండలం పాతగుంటకు చెందిన వైసీపీ నాయకులు బొజ్జా రెడ్డి పై హత్యయత్నం కేసులో ముగ్గురు నింధితులను అరెస్టు చేసిన్నట్లు ఎస్ఐ శేషగిరి మంగళవారం తెలిపారు. ఇటీవల జగనన్న కాలనీ ఇంటి స్థల వివాదంలో అదే గ్రామంకు చెందిన మునింద్రా బొజ్జా రెడ్డి పై హత్యయత్నం చేయడం తెలిసిందే ఈ కేసులో పోలీసుల విచారణలో మరీన్ని వాస్తవాలు వెలుగు చూసిన్నట్లు తెలిసింది. హత్నయత్నం చేయడం చేయడంతో కొందరి ప్రేరేపన ఉందని తెలిసి ఆ దిశగా పోలీసులు చేపట్టిన విచారణలో వాస్తవాలు వెలుగు చూడటంతో కారణమైన నింధితులుమునింద్రా రెడ్డి, రాజేష్, భాస్కర్ రెడ్డిలను అరెస్టు చేసి పుత్తూరు కోర్టుకు హాజరుపరచగా సీజే వారికి 14 రోజులు రిమాండ్ ఆదేశించన్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఆధార్‌కేంద్రాల్లో కిక్కిరిసిన జనం

-ఈనెల 23 నుంచి 27వరకు

తొట్టంబేడు, జూలై 23 ప్రభాతవార్త



మండలంలోని బసవయ్యపాళెం పంచాయతీలోని సచివాలయంలో ఆధార్‌కార్డు కేంద్రాన్ని మండల ఎంపిడిఓ ఐజాక్ ప్రవీణ్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులు తమ తమ ఆధార్ కార్డులోని లోపాలను ఈ కేంద్రాల్లో సరిదిద్దుకోవచ్చని ఎంపిడిఓ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలోని బసవయ్యపాళెం, పొయ్య, పెద్దకన్నలి, రౌతుసూరమాల, ఇలగనూరు పంచాయతీల్లో ఈనెల 27వ తేదీ వరకు ఆధార్ కేంద్రాల్లో బయోమెట్రిక్ అప్డేట్, డాక్యుమెంట్ అప్లోడ్ మరియు నూతన ఆధార్ కార్డుల నమోదు చేసుకొనుటకు ఆధార్‌క్యాంపులను ఏర్పాటు చేయమని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారని 0-5 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలు, ఐదు సంవత్సరాలు పైబడిన వారు బయోమెట్రిక్ అప్డేట్, డాక్యుమెంట్ అప్లోడ్, ఫోన్‌నంబర్ అనుసంధానం వంటివి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓతో పాటు ఇఒపిఆర్‌డి తరుణాక్షరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపికి ప్రత్యేక సాయం ప్రకటించడం హర్షణీయం

-ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 23 ప్రభాతవార్త



కేంద్ర బడ్జెట్‌లో ఏపికి ప్రత్యేక సాయం ప్రకటించడం శుభపరిణామం అని రాష్ట్రానికి రాజధాని అమరావతి, జీవనాడి పోలవరం ప్రాజెక్టుల పూర్తికోసం సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వానికి బడ్జెట్‌లో ఏపి పునర్నిర్మాణానికి రూ.15వేల కోట్లు కేటాయించి అదేవిధంగా ఆగిపోయిన వెనుకబడిన ప్రాంతాలకు అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇస్తామని చెప్పడం రాష్ట్ర ప్రగతికి నియోజకవర్గాల అభివృద్ధికి తోడ్పడుతోందని ఏపిలో పారిశ్రామిక మౌళిక సదుపాయాల కల్పనకు ఆర్థిక సాయం ఇవ్వడం వల్ల పారిశ్రామిక అభివృద్ధి జరుగుతుందని తద్వారా నిరుద్యోగ యువతీ యువకులుకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని ఈసందర్భంగా కేంద్రప్రభుత్వానికి శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజల తరపున మేలు చేకూరుతుందని తెలిపారు.

## స్వతంత్ర్య సమర యోధులను స్మరించుకోవడం మరవద్దు

తొట్టంబేడు, జూలై 23 ప్రభాతవార్త



స్వతంత్ర సమరయోధులను మరచిపోవద్దని వారిని నిత్యం స్మరించుకోవాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి ప్రభువ మహిళా డిగ్రీ కళాశాలలో భారత్ స్కాట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో బాలగంగాధర్ తిలక్ జయంతిని, చంద్రశేఖర్ ఆజాద్ జయంతనిఇ ఘనంగా జరుపుకునానరు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధులను గుర్తించుకోవాలన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో స్కాట్ మాస్టర్ అజారుద్దీన్, సుబ్రమణ్యం, పిడి నరసింహారావు, ధనుష్‌ర, లీడర్లు సంఘవి, వైష్ణవి, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

## 25 నుండి శ్రీ త్యాగరాజస్వామి వార్షిక సంగీతం, నృత్యోత్సవాలు

తిరుపతి హెల్త్, జులై 23, ప్రభాతవార్త



స్థానిక టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు వద్దనున్న శ్రీ త్యాగరాజస్వామి వారి టెంపుల్ బిల్డింగ్ నందు ఆ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో 80వ సంగీత నృత్యోత్సవాలను ఈ నెల 25వ తేది నుండి 29వ తేది వరకు ఘనంగా శ్రీ వెంకటేశ్వర సంగీత కళాశాల విద్యార్థుల మంగళ వాయిద్యా కార్యక్రమాలతో నిర్వహిస్తున్నట్లు త్యాగరాజు ఫెస్టివల్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మోహన్ సుందరం, కంచి రఘురామ్‌లు పిలునిచ్చారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో మంగళవారం మీడియా ముందు వీరు మాట్లాడుతూ ఈ ఐదు రోజుల పాటు ఎందరో సంగీత పీతామహుల కార్యక్రమాలను ఈ ఉత్సవాలలో భాగంగా ప్రదర్శిస్తారని తెలిపారు. నగర ప్రజలు, సంగీత, నృత్య కళాకారులు, కళాపోషకులు, అభిమానులు విచ్చేసి ఈ ఉత్సవాలను జయప్రదం చేయాలని తెలిపారు.

## అభివృద్ధే ధ్యేయంగా ఎన్డీఏ

టిడిపి హర్షం

తిరుపతి హెల్త్, జులై 23, ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ అభివృద్ధే ధ్యేయంగా ఎన్డీఏ కేంద్ర ప్రభుత్వం ఏపీకి బడ్జెట్ నిధులను కేటాయించడం హర్షనీయమని తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ ఇంచార్జ్ నరసింహ యాదవ్ కొనియాడారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో మంగళవారం మీడియా ముందు టిడిపి నాయకులు చేజర్ల మనోహర్ ఆచారి తదితరులతో కలిసి నరసింహ యాదవ్ మాట్లాడుతూ బిజేపి పాలక కేంద్ర ప్రభుత్వం ఏపీని దేశంలోనే అగ్రస్థానంలో చూడడం అభినందనీయమన్నారు. భారత్‌లోని అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పై దృష్టి కేంద్రీకరిస్తురన్నారు. గత ఐదు ఏళ్ళుగా వైసిపి చేయలేని పోలవరం ప్రాజెక్టు తదితర పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలు ఇక ఊపందుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వైసిపి అవినీతి ఫైల్స్‌ను మదనపల్లిలో రాత్రికి రాత్రి కాల్చారని అదేవిధంగా అమరావతి కరకట్ట ప్రాంతంలో అవినీతి చిట్టాల ఫైల్స్ కాల్చుతుండగా రైతులు కనిపెట్టారని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌కుపూర్వ వైభవాన్ని తీసుకొస్తున్న కూటమి ప్రధాన నేతలు సిఎం చంద్రబాబుకు, ఉప సిఎం పవన్ కళ్యాణ్‌కు, మంత్రి లోకేష్ తదితరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ధర్మరాజుల స్వామి ఆలయంలో కుంభం

శ్రీకాళహస్తి, జులై 23 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం మధ్యాహ్నం ఆలయం వద్ద కుంభం కార్యక్రమాల్ని సంప్రదాయబద్దంగా నిర్వహించారు. ఆలయ పూజారి పురుషోత్తం, రఘుల పర్యవేక్షణలో కుంభం ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో డెప్యూటి ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, టౌన్ సిఐ నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతులకు కృత్తిమకాలు అమరిక

తొట్టంబేడు, జూలై 23 ప్రభాతవార్త

తిరుపతి జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగాకృత్తిమ కాలు అమర్చుటకు కొలతలు తీసుకొనుటకు చెన్నై ఫ్రీడమ్ ట్రస్టు సారధ్యంలో ఈనెల 27న శనివారం తిరుపతిలోని ఎయిర్‌బైపాస్‌రోడ్డులోని రాస్ భవనంలో ఉచిత క్యాంప్‌ను నిర్వహిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. అర్హులకు కృత్తిమ కాలు కొలతలు తీసుకుని రూ.51వేలు విలువ కలిగిన ఆధునిక వెయిట్‌లెస్‌కృత్తిమకాలు 20రోజుల తర్వాత ఉచితంగా అమర్చబడుతందన్నారు. క్యాంప్‌కు వెళ్ళేవారు తమ ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, సదరం మెడికల్ సర్టిఫికెట్, వికలత్వం కనిపించే విధంగా రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, ఫోన్‌నెంబర్ తీసుకెళ్ళాలన్నారు. అవకాశాన్ని తొట్టంబేడు మండలంలోని విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ ఐజాక్ ప్రవీణ్ తెలిపారు.

## ప్రమాదం జరిగితే కానీ పట్టించుకోరా?

-ఇదీ మున్సిపల్‌శాఖ తీరు

.శ్రీకాళహస్తి, జూలై 23 ప్రభాతవార్త



చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభమేంటి అన్నట్లుంది పురపాలక అధికారుల పరిస్థితి. గత రెండు నెల రోజులపై నుంచి ఓటేరుకాల్వవీధిలో ఉన్న చిన్నమసీదువీధిలో కాలువకు చిన్నపాటి బొరకపడింది. ప్రస్తుతం ఇది పెద్దదవుతోంది. గతంలో కూడా ఈ కాల్వ బొగదపడడంతో తూతూమంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకున్నారు. పెద్దవాహనాలు, ద్విచక్రవాహనాలు, విద్యార్థులు ఈమార్గంలో వస్తుంటారు. ప్రమాదశాత్తు ఇక్కడ కల్వర్టు కుంగితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి ఈమార్గంలో చిన్నపాటి కల్వర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలకు చెక్‌పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## అక్కినేని నాగేశ్వరరావుకు ఘననివాళులు

శ్రీకాళహస్తి, జూలై 23 ప్రభాతవార్త



పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్, నటసామ్రాట్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకలు సందర్భంగా అక్కినేని స్వగ్రామం గుడివాడ వద్ద ఉన్న వెంకటరాఘవాపురంలో శతజయంతి వేడుకలు నిర్వహించారు. దివంగత మహానటుడు అక్కినేని విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాష్ట్ర అక్కినేని ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 100మందికి అన్నదానం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పురాణం వెంకటరమణ, సుబ్బారావు, నవీన్‌ప్రసాద్, బిఆర్.దాసు, వెంకటముని, సుకుమార్‌రెడ్డి, ప్రభాకర్‌రావు, షఫి తదితరులు అక్కినేని నాగేశ్వరరావు జీవిత విశేషాలు గురించి వివరించారు. కాగా నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడంతోపాటు సీనియర్ అక్కినేని అభిమానులను సత్కరించారు. కార్యక్రమంలో పురాణంవెంకటరమణ, వెంకటముని, సుకుమార్‌రెడ్డి, ప్రభాకర్, సుబ్బారావు, నవీన్‌ప్రసాద్, బిఆర్.దాసు, షఫి శ్యామలరావు, అప్పారావు తదితర అక్కినేని అభిమానులు పాల్గొన్నారు. కాగా అక్కినేనికళాకేంద్రంలో శిక్షకురాలు విద్యతో పాటు అటెండర్ ప్రసాద్, మాజీ సర్పంచ్ లక్ష్మణరావు తదితరులు హాజరయ్యారు.

## కేంద్ర ఆర్థికశాఖ బడ్జెట్‌పై బిజెపి నాయకులు హర్షం

-కార్యాలయం వద్ద సంబరాలు

శ్రీకాళహస్తి, జూలై 23 ప్రభాతవార్త



కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ నేడు పార్లమెంటు బడ్జెట్ ప్రవేశపెట్టడంపై హర్షం వ్యక్తం చేస్తూ బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా. ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద టపాకాయలు పేల్చి స్వీట్లు పంచుకుంటూ సంబరాలు నిర్వహించుకున్నారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కోలా.ఆనంద్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఏపికి ప్రత్యేకసాయం ప్రకటించడం శుభపరిణామం అని ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి, జీవనాడి పోలవరం, ప్రాజెక్టుల పూర్తికోసం సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రకటించిన కేంద్రప్రభుత్వానికి బడ్జెట్‌లో రాష్ట్ర పునర్నిర్మాణానికి రూ.15వేలకోట్లు కేటాయించి అదేవిధంగా ఆగిపోయిన వెనుకబడిన ప్రాంతాలకు అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇస్తామని చెప్పడం రాష్ట్ర ప్రగతికి నియోజకవర్గాల అభివృద్ధికి తోడ్పడుతుందని ఏపిలో పారిశ్రామిక మౌళిక సదుపాయాల కల్పనకు ఆర్థిక సాయం ఇవ్వడం వల్ల పారిశ్రామిక అభివృద్ధి జరుగుతుందని తద్వారా నిరుద్యోగ యువతీ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని డబుల్ ఇంజన్‌సర్కారు ప్రభుత్వంలో వికసిత్ భారత్‌తో పాటు వికసిత్ ఆంధ్రప్రజల దృష్టికి కనిపిస్తుందని ఇక రానున్న రోజుల్లో రాష్ట్రంలో అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని సంతోషం వ్యక్తం చేశారు. అసెంబ్లీ కో కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు గరికపాటి రమేష్‌బాబు, జివిఅమర్నాద్, ఎస్వీరమణ పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## డయేరియాపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా వ్యవహరించాలి

-సూపరింటెండెంట్ డా.విజయలక్ష్మి

శ్రీకాళహస్తి, జూలై 23 ప్రభాతవార్త



డయేరియాపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం ఏరియా ఆస్పత్రిలో 'స్టాప్ డయేరియా' అన్న నినాదంతో విరేచనాల వల్ల కలిగే ప్రాణనష్టాన్ని ఆపుదాం.. కార్యక్రమంలో భాగంగా ఈనెల 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు ఉధృత అతిసార నియంత్రన మాసోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ డయేరియా వల్ల కలిగే నష్టాలను వివరించారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత శుభ్రత పాటించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. నీళ్లవిరేచనాలు మొదలైన వెంటనే ఓఆర్ఎస్ తాగించాలని దానితో పాటు 14రోజుల వరకు జింక్ కూడా ఇస్తూనే ఉండాలని వీటితో శక్తి వస్తుందన్నారు. ప్రతి ఒక్కరు కాచి చల్లార్చిన నీటినే తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## గుండెపోటుతో యువకుడు మృతి

రామచంద్రాపురం, జూలై 23 ప్రభాతవార్త:



హేమంత్ (ఫైల్‌పోటో)

అనుప్పల్లి పంచాయతీ, రేకలచేను గ్రామంలో మంగళవారం గుండెపోటుతో యువకుడు మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు .. పచ్చార్ల హేమంత్ (31) పొలం గట్టుపై వెళుతుండగా గుండెపోటుకు గురై ప్రక్కనే వున్న వరి పంటలో కూలిపోయాడు. గ్రామానికి కొంత దూరంలో ఈ పొలం వుండటంతో ఇక్కడ రైతుల జాడలేకున్నది. దీంతో కొంత సమయం విలవిలాడిన హేమంత్‌ను చూసి గ్రామశునకాలు గట్టిగా మొరగడంతో గ్రామస్థులు అక్కడికి చేరుకున్నారు. హేమంత్ కుప్పకూలి వరిపంట బురదలో పడివుండటంతో వెలికితీసి పరిశీలించగా మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడికి భార్య, కుమారుడు, తమ్ముడు, తల్లిదండ్రులు వున్నారు.

## రాష్ట్రానికి నిధుల వరద

బిజెపి జిల్లా కార్యదర్శి కాయం హరినాధ రెడ్డి

రామచంద్రాపురం, జూలై 23 ప్రభాతవార్త:



కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు నిధుల వరద కురిపించిందని బిజెపి జిల్లా కార్యదర్శి కాయం హరినాధరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మీడియా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత 5 ఏళ్ళు అన్నివిధాలుగా అణగదొక్కబడిన అమరావతి అభివృద్ధికి రూ.15 వేలు కోట్లు నిధులు కేటాయించడం, అవసరమైన మేరకు మరిన్ని అదనపు నిధులు కేటాయిస్తామని హామీ ఇవ్వడం హర్షనీయమన్నారు. పోలవరం నిర్మాణం సకాలంలో పూర్తిచేయడానికి స్పష్టమైన హామీ ఇవ్వడం, విశాఖ-చెన్నై, హైదరాబాద్-బెంగుళూరు కారిడార్‌ల నిర్మాణాలకు ప్రత్యేక నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్యాకేజీ క్రింద ప్రత్యేక నిధులు అందించడం శుభపరిణామమన్నారు. ఈ బడ్జెట్ ఆంధ్రప్రదేశ్‌కు డబుల్ ఇంజన్ ప్రభుత్వమని నిర్ధారణ అయ్యిందన్నారు.

## పుట్టగొడుగుల పెంపకంపై సర్టిఫికెట్ కోర్సు

నగరి, జూలై 23 ప్రభాతవార్త:



పుట్టగొడుగుల పెంపకంపై సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించినట్లు నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం నూతన కోర్సు ప్రారంభాన్ని పురస్కరించుకుని కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడవ సంవత్సరం బీజెడ్‌సీ విద్యార్థుల కొరకు పుట్టగొడుగులను పెంచే కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఈ ప్రాజెక్టు ద్వంద్వ ప్రయోజనానికి ఉపయోగపడుతుందన్నారు. ఇది విద్యార్థులకు విలువైన హ్యాండ్-ఆన్ అనుభవాన్ని అందించడంతో పాటు శిలీంద్రాలు గురించి తరగతి గది పరిజ్ఞానాన్ని అమలు పరచడానికి వీలు కల్పిస్తుందన్నారు. పండించిన పుట్టగొడుగులను కళాశాల ఫ్యాకల్టీకి అమ్మడం జరుగుతుందన్నారు. జువాలజీ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం విద్యార్థులు అవసరమైన నైపుణ్యాలను పొందేలా చేయడంలోఈ కోర్సు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. విజయవంతంగా పుట్టగొడుగుల పెంపకానికి అవసరమైన పరిజ్ఞానం, మెళకువలను విద్యార్థులకు అందించేందుకు ప్రత్యేకంగా సర్టిఫికెట్ కోర్సును ఏర్పాటు చేశామని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జి.స్వాతి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సచివాలయ సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

విజయపురం, జూలై 23 ప్రభాతవార్త:



సచివాలయ సిబ్బంది, ఇతర ఉద్యోగులు ప్రతి రోజు బయోమెట్రిక్ అంటెండన్స్ వేయాల్సిందేనని ఎంపీడీవో బ్రహ్మయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్‌కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, ఏఎన్ఎంలకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది సచివాలయ సిబ్బంది సక్రమంగా బయోమెట్రిక్ అటెండన్స్ వేయడం లేదని, ఇకపై ప్రతి రోజు మూడు సార్లు బయోమెట్రిక్ వేయాలని సూచించారు. అటెండన్స్‌వేయకపోతే జీతం కట్ చేస్తానని హెచ్చరించారు. ప్రతి గ్రామ పంచాయతీలో 15 రోజులకు ఒక సారి ట్యాంకు, మురికి కాలువలను క్లీన్ చేయాలని సూచించారు. రోడ్డు పక్కన ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు పేడ దిబ్బలు తొలగించాలని సూచించారు. ద ప్రతి పంచాయతీలో శానిటేషన్ రిజిస్టర్ అందుబాటులో ఉంచాలన్నారు. ఈవోపీఆర్‌డీ బాబు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధార్ నమోదుకు ప్రత్యేక కేంద్రాలు ప్రారంభం

సత్యవేడు, జూలై23, ప్రభాతవార్త:



సత్యవేడు మండలంలో ఆధార్ నమోదుకు ప్రత్యేక కేంద్రాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు మండల అధికారులు ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే తొలిరోజు మండలంలోని దాసుకుప్పం, ఇరుగుళం సచివాలయాల్లో ఆధార్ నమోదు ప్రక్రియ చేపట్టారు. ఈనేపథ్యంలో దాసుకుప్పం కేంద్రంలో డిజిటల్ అసిస్టెంట్ ప్రకాష్, శ్రీధర్‌లు 21మందికి ఆధార్ నమోదు చేయించారు. ఇందులో వేలిముద్రలు, మొబైల్ నెంబరు అనుసంధానం, క్రొత్త కార్డులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే ఇరుగుళం కేంద్రంలో డిజిటల్ అసిస్టెంట్ బాలాజీ 23మందికి ఆధార్ నమోదు చేయించడం జరిగింది. కాగా యంపిడివో చంద్రశేఖర్ పర్యవేక్షణలో ఆధార్ నమోదు ప్రక్రియ సాగుతోంది. ఈకార్యక్రమంలో మహిళా పోలీసులు నిహారిక, శంకరమ్మ లు పాల్గొన్నారు.

## తెలంగాణా గవర్నర్ రాధాకృష్ణన్‌కు

బిజెపి నేతల సన్మానం

తిరుపతిటౌన్, జులై 23ప్రభాతవార్త:



తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి దర్శనార్థమ్ మంగళవారం సాయంత్రం వచ్చిన తెలంగాణా,జార్ఖండ్ రాష్ట్రాల గవర్నర్ రాధాకృష్ణన్‌కు బిజెపి నేతలు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ఆలయం వెలుపల గవర్నర్ రాధాకృష్ణన్‌కు బిజెపి నాయకులు గుండాల గోపీనాధరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, మల్లారపు రవిప్రసాద్, సుబ్రమణ్యంయాదవ్, దీపక్‌యాదవ్, జయంత్‌కుమార్, మణి పుష్పగుచ్ఛం అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించారు.

## ఆర్టీసి కార్గో సేవలను ప్రజలకు మరింత చేరువచేయాలి

-ప్రజలకు సౌకర్యంగా ఆర్టీసి బస్సులు -ఆర్ఎం చెంగల్‌రెడ్డి

తిరుపతిటౌన్, జులై 23ప్రభాతవార్త:



ప్రజల సౌకర్యార్థం ఆర్టీసి సంస్థ అమలుచేస్తున్న కార్గో సేవలను మరింత చేరువచేయాలని తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి టి.చెంగల్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో ప్రయాణీకుల రద్దీ ఉన్న మార్గాల్లో మరిన్ని బస్సులను సౌకర్యవంతంగా నడపాలని ఆదేశించారు. ప్రజలనుండి బస్సుల కోసం వస్తున్న వినతులను పరిశీలించి ఆయా రూట్లలో సమయానికి బస్సులు తిరిగేలా చూడాలన్నారు. మంగళవారం తిరుపతి జిల్లా పరిధిలోని ఆర్టీసి ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. రానున్న తిరుమలేశుని బ్రహ్మోత్సవాలకు బస్సుల కండీషన్, భక్తులకు మెరుగైన సేవలందించేలా ఉంచాలన్నారు.

ఆర్టీసి బస్టాండ్‌లో శుభ్రతకు, భద్రతకు ప్రాధాన్యత నివ్వాలని అధికారులను ఆదేశించారు.

## ఢిల్లీ ధర్నా జగన్ ఆడుతున్న డ్రామా

బాబాయ్ హత్య పై ఒక్క ధర్నా కూడా చేయని జగన్ ,
జనసేన ఇన్చార్జి కిరణ్ రాయల్

తిరుపతి హెల్త్, జులై 23, ప్రభాతవార్త



ఐదేళ్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలను పీడించుకుతిన్న నేటి మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి ఢిల్లీలో ధర్నా చేస్తానని పెద్ద డ్రామా ఆడుతున్నాడని జనసేన పార్టీ తిరుపతి ఇంచార్జి కిరణ్ రాయల్, సుభాషిణి, సుమన్ రాయల్‌లు విమర్శించారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో మంగళవారం మీడియా ముందు వారు మాట్లాడుతూ వైసిపి పాలనలో ఏనాడైనా ఢిల్లీలో జగన్ ద్వారా చేశాడా అంటూ కిరణ్ ప్రశ్నించారు. అక్రమాలు జరిగాయనే మదనపల్లి కలెక్టర్ ఆఫీసులో విలువైన డాక్యుమెంట్‌లను కాల్చేశారన్నారు. ప్రత్యేక హోదా, ప్యాకేజ్, స్టీల్ ప్లాంట్, రాజధాని కోసం, మీ సొంత బాబాయ్ హత్య తదితర ప్రధాన అంశాలపై ఏనాడైనా జగన్ ఢిల్లీలో ధర్నా చేశాడా అంటూ ప్రశ్నించారు. మా కూటమి పాలన వచ్చిందని కక్ష సాధింపులకు పాల్పడడం తమకు తెలియదని, తాము రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా పనిచేయడమే తెలుసునని వైసిపికి కౌంటర్ ఇచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో జనసేన పార్టీ నేతలు కిషోర్, సాయి దేవ్, ఆది, గోపి, శ్రీనివాసులు, సమంత్, శేషాద్రిలు పాల్గొన్నారు.

# వారి జిల్లాకు చేసిన సేవలు ఎనలేనివి : జిల్లా కలెక్టర్

తిరుపతి కార్పొరేషన్, జులై 23 ప్రభాతవార్త: జేసిగా పని చేసి విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా వెళ్తున్న ధ్యాచంద్ర, కడప జిల్లా జెసిగా బదిలీపై వెళ్తున్న మున్సిపల్ కమిషనర్ అధితి సింగ్ చేసిన సేవలు ఎనలేనివని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, పలువురు అధికారులు కొనియాడారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జెసి ధ్యాన చంద్ర, కమిషనర్ అధితి సింగ్‌కు ఆత్మీయ వీడ్కోలు సమావేశం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ క్లిష్టమైన తిరుపతి జిల్లా ఎన్నికల నిర్వహణ సమయంలో ధ్యానచంద్ర, అధితి సింగ్ ఉన్నారి వారు సమర్ధవంతంగా నిర్వహించారని, వారు ఎంతో బాధ్యతగా నిర్వహించారని తెలిపారు. తాను వారు తనదైనశైలిలో



చక్కగా విధులు నిర్వహించారన్నారు. యువ అధికారులుగా చురుకుగా ఎన్నికలలో రిటర్నింగ్ అధికారిగా చక్కగా బాధ్యతలు నిర్వర్తించారని కొనియాడారు. అధితి సింగ్ చక్కగా క్లిష్టమైన తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ స్వార్వత్రిక ఎన్నికల బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. అధితి సింగ్, ధ్యానచంద్ర ఇరువురికి అంతా మంచే జరగాలని కోరారు. బదిలీ పై వెళ్తున్న జేసి, కమిషనర్ మాట్లాడఉుతూ ఎన్నికల ప్రక్రియ సమయంలో తాను రావడం జరిగిందని, రిటర్నింగ్ అధికారిగా ఒక ఛాలెంజ్‌గా తీసుకుని జాగ్రత్తగా ఎన్నికలు నిర్వహించామని తెలిపారు. తిరుపతి జిల్లా వంటి క్లిష్టమైన సార్వత్రిక ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించడానికి సహకరించిన అందరు జిల్లా డివిజన్, మండల, బూత్ లెవెల్ స్థాయి వరకు అధికారులు, సిబ్బందికి, మీడియా వారికి అందరికీ తన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు 2024 నిర్వహణలో చాలా కీలకంగా ఎప్పటికప్పుడు అధికారులకు పలు సూచనలు చేస్తూ మార్గదర్శనం చేశారని కొనియాడారు. ఆర్డీఓలు కిరణ్ కుమార్, చంద్రమునిని, నిషాంత్ రెడ్డి, రవి శంకర్ రెడ్డి పలువురు అధికారులు మాట్లాడుతూ బెస్ట్ ప్రాక్టీసెస్‌ను అమలు చేస్తూ, ఆర్‌ఓగా వెంకటగిరి ఎన్నికల్లో విధులు నిర్వర్తిస్తూ, జిల్లాలో ఎన్నికల నిర్వహణలో ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తూ ఎంతో ప్రశాంతంగా సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు కృషి చేశారని ఎంతో మసర్ధవంతమైన అధికారి అని కొనియాడారు. అనంతరం ధ్యానచంద్ర, అధితి సింగ్‌కి పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు పలువురు వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఆర్డిఓలు, ఎస్డిసిలు, మండల తహశీల్దార్లు, ఎంపిడిఓలు పలువురు పాల్గొన్నారు.

## చల్లగా చూడమ్మా శ్రీ ఎల్లమ్మతల్లి

రేణిగుంట, జులై 23 ప్రభాతవార్త: రేణిగుంట పట్టణ శివారు సీబీఐడీ కాలనీకి వెళ్లే మార్గంలో కొలువు తీరిన మహా మహిమాన్వితురాలు శ్రీ ఎల్లమ్మతల్లికి వార్షిక జాతరలో భాగంగా రెండవ రోజు మంగళ వారం భక్తులు అంబళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని



ప్రత్యేక అలంకరణతో గుడిలో నిండు గా కొలువై భక్తులను కటాక్షించారు. దేవాలయ శాశ్వత ధర్మకర్త దివంగత దాము స్వామి సతీమణి సరసమ్మ ఆయన కుమారుడు ఏళుమలై రెడ్డి అమ్మ తల్లికి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ప్రజలను చల్లగా చూడాలంటూ అమ్మతల్లికి ప్రీతిపాత్రమైన మహా కుంభాన్ని అర్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి అమ్మవారికి సారలో భాగంగా పట్టుచీర, జాకెట్, పసుపు కుంకాలు, గాజులు, తదితర సాంప్రదాయ వస్తువులను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆమెకి ఆలయ మర్యాదలతో స్వాగతం అమ్మవారి దర్శనానంతరం ఆమెకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆమెతో పాటు అమ్మవారిని దర్శించుకున్న వారిలో టీడీపీ జిల్లా నాయకులు సుబ్రహ్మణ్యంరెడ్డి, రేణిగుంట మండల అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, రేణిగుంట పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, టీడీపీ సీనియర్ నేతలు డి.పుష్పనాథం, నవాబు, కొరియర్ రవి, నెల్లూరు సుబ్రహ్మణ్యం, ఉదయకుమార్‌రెడ్డి, దేవెళ్ళ రమణ, జగదీష్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

## పాఠశాల దశనుండే విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి చూపాలి




**డైరెక్టర్ సునీల్ కుమార్ రెడ్డి**

తిరుపతి విద్య, జులై 23 ప్రభాతవార్త : పాఠశాల దశ నుండే విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి చూపాలని డైరెక్టర్ సునీల్ కుమార్ రెడ్డి అన్నారు. స్థానిక బైరగి పట్టెడ, రాఘవేంద్ర నగర్ నందు గల రెడ్ చెర్రీస్ స్కూల్ విద్యార్థులు, ఒలంపిక్ సింబల్ ఆకారంలో కూర్చుని, భారతదేశం తరపున ఒలంపిక్ గేమ్స్ 2024లో పాల్గొనబోతున్న భారతీయ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేసారు. జయహో భారత్ వందేభారత్ లాంటి నినాదాలు మిన్ను ముట్టాయి. ఈ సందర్భంగా పాఠశాల అధినేత సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు దేశానికి, దేహానికి మంచివి అని అన్నారు. క్రీడలు దేశాల మధ్య సహృద్భా వతవరణాన్ని పెంపొందిస్తే, అవే క్రీడలు శారీరకంగా దృఢంగా ఉంచుతాయి అని అన్నారు. పాఠశాల దశనుండే విద్యార్థులు, క్రీడల పట్ల ఆసక్తికరపరచాలని అన్నారు. క్రీడల ద్వారా గెలుపు ఓటములను సమానంగా స్వీకరించగలరని అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మురళీధర్, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి చెంగల్వరాయస్వామి బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తి, జులై 23 ప్రభాతవార్త : దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో శుక్రవారం నుంచి ఆడికృత్తిక మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు నిలయంగా ఉన్న శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతి నెల ఓ ఉత్సవం నిర్వహిస్తున్నారు. ఈ నెపథ్యంలో ఈ నెల 24 నుంచి ఆడికృత్తిక మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు అధికారులు ఏర్పాట్లలో తలమునకలై ఉన్నారు. ఆలయంలోని చెంగల్వరాయ స్వామి ఆలయంలో అంకుర్పారణతో ప్రారంభం అయ్యే ఉత్సవాలు కుమారస్వామితిప్పపై భక్తుల బాగస్వామ్యంతో ఉత్సవాలు ఘనంగా నిర్వహించటం ఆనవాయితి.ఈ నేపథ్యంలో మంగళ వారం ఆలయంలో ఏర్పాట్లుకు సంబంధించి ఆలయ ఇఓ ఎన్ వియస్ ఎన్ మూర్తి ఆలయ అధికారులు, సిబ్బందితో చర్చించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది తరలివచ్చే ఉత్సవాలను దేవాదాయశాఖతో పాటు పలు శాఖలు సమన్వయంతో పని చేయాల్సిన



ఉందని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి విజయవాడ నుంచి అధికారులకు వివరించారు. ఉత్సవాలను విజయవంతం చేయటానికి దేవస్థానం పోలీసు, మున్సిపల్ అధికారులు సిబ్బంది సమన్వ యంతో పని చేయాల్సి ఉందన్నారు. ఈ నెల 24 నుంచి ఆలయంలోనూ, 28నుంచి విజ్ఞానగిరిపై జరిగే మహోత్సవాలను కూడా అంతే ప్రణాళికతో పోలీసుల సహకారంతో విజయవంతం చేస్తామన్నారు. తాను ఆలయ కార్యనిర్వహణాది కారిగా బాధ్యతలు చేపట్టిన తరువాత వచ్చిన మొదటి ఉత్సవాలు ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్ని ప్రజల మనోభావాలకు అనుగుణంగా నిర్వహిం చటంతో మంచి పేరు వచ్చిందన్నారు. అలాగే ఆడికృత్తిక మహోత్సవాల్ని కూడా గతంలో నిర్వహించని రీతిలో నిర్వహించాలని శాసనసభ్యుడు సూచించారని ఈ మేరకు అధికారులకు ఏర్పాట్ల గురించి వివరించామన్నారు.ఈ నెల 28 భరణి, 29 ఆడికృత్తిక, 30 తెప్పోత్సవం, 31 కళ్యాణోత్సవం నిర్వహించబడుతుందని వివరించారు.

## వేధింపుతో అంగన్‌వాడికి అనారోగ్యం

శ్రీకాళహస్తి రూరల్,జులై 23 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం మన్నవరం పంచాయతీ అంగన్ వాడి కార్యకర్త వి.గాయత్రి మానసిక వత్తిడి భరించలేక అనారోగ్యానికి గురై ఆసుపత్రి పాలయ్యారు. ఆమెను హుటాహుటిన కుటుంబసభ్యులు శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు.బాధితురాలి కథనం మేరకు గాయత్రి మన్నవరం గ్రామ అంగన్‌వాడిగా మూడు సంవత్సరాలు ఎనిమిది నెలలుగా పని చేస్తున్నట్లు తెలిపారు.అయితే తన భర్త చెంచయ్యనాయుడు



వైకాపా పార్టీకి పని చేసాడనే భావంతో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావటంతో వేధింపులు మొదలయ్యాయని వాపోయింది. గాయత్రి కొలువు మన్నవరంలో ఉండగా వెంకటగిరిలో నివాసముంటున్నారు.కొత్త ప్రభుత్వం పాలకులు వ్యవస్థను మార్చాలనే భావంతో సిడిపిఓ ద్వారా వత్తిడి తీసుకువచ్చినట్లు సమాచారం.దాంతో మానసిక వత్తిడికి గురైన గాయత్రి అనారోగ్యానికి గురైంది.బిపి పెరిగి ఫిట్స్‌లా రావటంతో వెంటనే ఆమెను కుటుంబ సభ్యులు శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యచికిత్సలు అందించి స్వగ్రామానికి చేర్చారు.ఈ సంఘటనకు సంబంధించి సిడిపిఓ శాంతి దుర్గను వివరణకోరగా గ్రామ సెక్టార్ సూపర్‌వైజర్ ఫిర్యాదు మేరకు ఆగన్‌వాడి కేంద్రాన్ని పరిశీలించగా కేంద్రంలో ఏడు మంది ఉండగా ఇద్దరే ఉన్నట్లు గుర్తించా మన్నారు. అక్కడే ఇద్దరు తల్లులు ఉన్నామన్నారు. దాంతో తాము సంఖ్య పెంచాలి కదా అని ప్రశ్నించినట్లు వివరణ ఇచ్చారు. రాజకీయ ప్రమేయం లేదన్నారు. కాగా విషయం తెలుసుకున్న సిపిఎం నేతలు అంగేరిపుల్లయ్య, గురవయ్య, మణి తదితరులు అంగన్‌వాడీ టీచర్‌ను పరామర్శించారు.

## నేడు నారా భువనేశ్వరి పర్యటన వివరాలు

**కుప్పం, జులై 23 ప్రభాతవార్త**

సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి నాలుగు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా బుధవారం కుప్పం మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 9.00-9.30గంటల మధ్య కుప్పం పిఇఎస్ అతిథిగృహం వద్ద తెదేపా నేతలతో సమావేశం నిర్వహిస్తారు. 9.45-10.45గంటల దాకా మండలంలోని కొత్తపల్లిలో పర్యటించి ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం నడిమూరు, పైపాళ్యం గ్రామాల్లో పర్యటించనున్నారు. పైపాళ్యం గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్లు నారా భువనమ్మ ప్రకటిస్తారు. అనంతరం మధ్యాహ్నం 2గంటలనుంచి ఉర్ల ఓబనపల్లి, గుడ్లనాయనపల్లి గ్రామాల్లో పర్యటించిన అనంతరం సాయంత్రం 5గంటలకు శాంతిపురం మండలం శివపురం వద్ద సొంతింటి నిర్మాణాన్ని స్వయంగా పరిశీలిస్తారు. అనంతరం కుప్పం పిఇఎస్ అతిథిగృహం చేరుకుని పార్టీ సమన్వయకమిటీ నేతలతో సమావేశం నిర్వహిస్తారు.

## అధికారులు నిర్లక్ష్యాన్ని వీడండి : జిల్లా వైద్యాధికారిణి



గంగవరం, జులై 23 ప్రభాతవార్త :అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి ప్రబలుతున్న అంటువ్యాధులను అరికట్టాలని జిల్లా వైద్యాధికారిణి ప్రభావతిదేవి అధికారులను ఆదేశించింది.డెంగ్యూ వ్యతిరేక మాసోత్స వాల్లో ఆమె మంగళవారం గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు,వైద్య సిబ్బందికి స్థానిక ఎమ్పీడివో కార్యాలయంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..వర్షాకాలం అయినందున డయేరియా, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు గ్రామాల్లో, పట్టణాల్లో వ్యాప్తి చెందకుండా పూర్తి స్థాయిలో అరికట్టే విధంగా చర్యలు తీసు కోవాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించింది.పారిశుద్ధ్యం,నీటి కలుషితం వల్ల అంటువ్యాధులు వ్యాప్తి చెందకూడదని,ఒక్క మరణం కూడా సంభవించకూడదని వైద్య సబ్బందిని ఆమె హెచ్చరించారు. ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనం గడపాలని,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని వ్యక్తిగత శుభ్రతను పాటిస్తూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఆమె తెలిపారు. గర్భవతులకు సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఆర్సీ హెచ్ పోర్టల్ నందు నమోదు చేసి వారి అందించాల్సిన పోషక పదార్థాలు అందించి ప్రతి నెల 9న జరిగే ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమానికి హజరయ్యేలా చూడాలని అధికారులను ఆమె ఆదేశించింది.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీనివాసులులతో పాటు శిశు సంక్షేమశాఖ అధికారులు,అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సుబ్రమణ్యం స్వామికి ప్రత్యేకాభిషేకాలు

శ్రీకాళహస్తి, జులై 23 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో అధ్యాత్మిక చింతన వెల్లి విరుస్తుంది. ధార్మిక దివ్యక్షేత్రంలో ప్రతి రోజూ ధార్మిక కార్యక్రమాలతో తులతూగుతుంది.స్థానిక భక్తులే కాకుండా దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు కూడా ఆధ్యాత్మిక చింతతనలో తన్మయత్వం పొందుతున్నారు.పట్టణానికి ఓ వైపు దుర్గంబా కొండ మరో వైపు సుబ్రమణ్యం స్వామి ఆలయం కుమారస్వామి తిప్పగా వెలసి భక్తుల కొంగుబంగారంగా విరాలజిల్లుతుంది.మంగళవారం పట్టణంలోని సుబ్రమణ్యం స్వామి ఆలయాలు భక్తులతో కిట కిట లాడుతున్నాయి.ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి పట్టణంలోని తేరువీధిలో వెలసిన షణ్ముఖ స్వామి ఆలయం అలాగే శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న కుమారస్వామి కొండపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయం,శ్రీకాళహస్తీశ్వరాలయంలో రంగుల గోపురం పక్కన వెలసిన స్వామి,ఆలయంలోని చెంగల్వరాయస్వామి ఆలయంలో విశేషాభిషేకాలు నిర్వహించారు. తేరువీధిలో వెలసిన 'షణ్ముఖ స్వామి' ఆలయంలో స్వామికి షోడషాభిషేకాలు నిర్వహించారు. వందలాది లీటర్ల పాలు, పెరుగు,తేనే,విభూది,గంధం, కుంకుమ, పసుపు,సకల సుగంధ ద్రవ్యాలతో పూజలు అభిషేకాలు నిర్వహించారు.చూపరులను ఇట్టె ఆకట్టుకునే రీతిలో అర్చకులు ప్రసాద్,మురళిలు తీర్చి దిద్దుతున్నారు.

## నారా భువనమ్మకు ఘనస్వాగతం



గుడుపల్లె, జులై 23 ప్రభాతవార్త : నాలుగు రోజుల కుప్పం పర్యటనకు విచ్చేసిన సిఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరికి ఘనస్వాగతం లభించింది. బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో నారా భువనమ్మకు ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, దేశం నేత రవినాయుడు ఘనస్వాగతం పలికారు.అనంతరం రోడ్డుమార్గంలో నారా భువనమ్మ రాష్ట్ర సరిహద్దుల్లోని కెంపాపురం బార్డర్‌కు చేరుకున్నారు. అక్కడ నియోజకవర్గ దేశం శ్రేణులు, జనసేన, బిజెపి నేతలు, మహిళా నేతలు నారా భువనమ్మకు ఘనస్వాగతం పలికారు. అక్కడ నుంచి గెసికపల్లి, 64పెద్దూరు, వెంకటాపురం గ్రామాల్లో మహిళలు అడుగడుగునా హారతులు పట్టి స్వాగతించారు. ముందుగా అనుకున్న షెడ్యూల్ కంటే నారా భువనమ్మ పర్యటన ప్రజల ఆదరాభిమానాల మధ్య కొంత ఆలస్యంగా సాగింది.

## జననీరాజనాల మధ్య.. ఆప్యాయతతో వినతులు స్వీకరణ

కుప్పం, జులై 23 ప్రభాతవార్త : కుప్పం పర్యటనకు విచ్చేసిన సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి తొలిరోజు పర్యటనలో ప్రజలతో మమేకమయ్యారు. గ్రామగ్రామాన మహిళలు, ప్రజలు భువనమ్మకు నీరాజనాలు పలికారు. ఈసందర్భంగా కమ్మగుట్టపల్లి, గుత్తార్లపల్లి, కోటపల్లి తదితర గ్రామాల్లో భువనమ్మ మహిళలతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలనుంచి మంచి స్పందన లభించింది. మహిళల సమస్యలను సావధానంగా విని ఆప్యాయతతో మహిళలు, ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. ప్రతి సమస్య పరిష్కారానికి తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చంద్రబాబు పాలనలో కుప్పం అభివృద్ధి చెందుతుందని కుప్పం ప్రజలకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.



## వైభవంగా ముగిసిన పుట్టాలమ్మ గ్రామోత్సవం



కోట, జులై 23 ప్రభాతవార్త : కోట మండలం చెందోడు గ్రామంలో శ్రీ పుట్టాలమ్మ ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. వాహనంపై అమ్మవారిని పూలతో అలంకరించి గ్రామ పురవీధుల్లో బాణాసంచా వేడుకలు, తప్పెట్లతో ఉత్సవం కొనసాగింది. అమ్మవారికి గ్రామంలోని ప్రజలు కొబ్బరికొయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

## క్రికెట్ మ్యాచ్‌లో సత్తా చాటిన భాను, శ్రీ హర్ష

వెంకటగిరి, జులై 23 ప్రభాతవార్త : స్థానిక తారకరామా క్రీడా ప్రాంగణంలో అండర్ 16 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో భాను శ్రీ హర్ష, గౌతం సత్తా చాటారు. విశాఖపట్నం విజయనగరం జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మొదటి రోజు విజయనగరం బ్యాటింగ్ చేపట్టి 101కి ఆల్ అవుట్ అయ్యారు. విశాఖ పట్నం బ్యాటింగ్ చేపట్టే 176కు 34 ఓవర్స్ చేశారు. విజయనగరం బౌలింగ్ 75 లీడింగ్‌లో ఉన్నారు.





## ప్రకృతి వ్యవసాయం రైతుకు లాభదాయకం : డిఎ



చిట్టమూరు, జులై 23 ప్రభాతవార్త : ప్రకృతి వ్యవసాయం రైతుకు ఏటిఎం లాంటిదని తద్వారా రైతు నిరంతరం లాభాలు పొంది కుటుంబ ఆర్థిక స్థితిగతులను గణనీయంగా పెంపొందించుకోవచ్చని ప్రకృతి వ్యవసాయం తిరుపతి జిల్లా విభాగం డిఎ రవిచంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం మొలకలపూడి యూనిట్ పరిధిలో యాకసిరి గ్రామంలో ఆయన ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఐసిఆర్‌పి నాగూర్‌కు చెందిన 20 సెంట్లు పొలంలో ఆకు, తీగ, గడ్డ, కూరగాయల జాతులకు చెందిన వంగడాలను ఎలా పండించాలో వివరించారు. ప్రకృతి వ్యవసాయంలోని ఏటిఎం మోడల్‌లో క్రమం తప్పకుండా అతి తక్కువ ఖర్చుతో పంటలను సాగు చేసుకోవచ్చని సూచించారు. దీనిద్వారా ప్రకృతి నీటి వసతితో పాటు తెగళ్ల లేని ఆరోగ్యవంతమైన పంటలను భావితరాలకు అందించవచ్చని అన్నారు. రైతులందరూ ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపి లాభాలు పొందాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా మొలకలపూడి యూనిట్ ఇన్‌ఛార్జ్ ధనమ్మ సేవలను రైతులందరు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రవిచంద్రప్రసాద్‌తో పాటు డివిజన్ మాస్టర్ ట్రైనర్ అనంతరావు, మోడల్ మేకర్ శ్రీనివాసులు, కృష్ణ, చిట్టమూరు మండల యూనిట్ ఇన్‌ఛార్జ్ ధనమ్మ, యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు, ఐసిఆర్‌పిలు పాల్గొన్నారు.

## జిల్లా అధికారిచే పంటపొలాల పరిశీలన.

కుప్పం, రామకుప్పం జులై 23 ప్రభాతవార్త :కుప్పం మున్సిపాలిటి,రామకుప్పం మండలం తిమ్మసముద్రంలో సాగు చేస్తున్న వేరుశనగపంటను మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి మురళీ కృష్ణ పరిశీలించారు.ఈ సందర్భంగా వేరుశనగ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.ప్రకృతి వ్యవసాయ విధానాన్ని పాటించి రైతులు ఇంటిదగ్గరే జీవామృతాలు,కషాయాలు తయారుచేసుకుని ఖర్చులుతగ్గించు కోవాలని సూచించారు.వీటిద్వారా నేలకూడా ఆరోగ్యంగా ఉండటంతోపాటు పంటలసాగు సైతం అధికంగా దిగుబడిఅయ్యే అవకావముందని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో ఏఓలు అమృతవల్లి,అమృత,ఏఈఓ ఔరంగ్,సిబ్బంది ఆనంద్,తిప్పేస్వామి,ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## మిస్ ఆంధ్రా యూనివర్స్‌గా చందన జయరాం ఎంపిక



శాంతిపురం, జులై 23 ప్రభాతవార్త: ఏపి, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల మొదటి ఆడిషన్ ఫినాలే పోటీల్లో శాంతిపురం మండలం ఎంకెపురంకు చెందిన కుమారి చందన జయరాం ఎంపికయ్యారు. ఈమె హైదరాబాద్‌లో టూరిజం- హాస్పిటాలిటీ కోర్సు పూర్తి చేశారు. ఈమె ఎంపిక పట్ల సీనియర్ దేశం నేత ఉయ్యాల జయరాంరెడ్డి, పలువురు నేతలు హర్షం వ్యక్తం చేశారు.

## గవర్నర్ రాధాకృష్ణన్‌కు ఘనస్వాగతం



రేణిగుంట, జులై 23 ప్రభాతవార్త: తెలంగాణ, పుదుచ్చేరి, జార్ఖండ్ రాష్ట్రాల గవర్నర్ రాధాకృష్ణన్‌కు రేణిగుంట విమానాశ్రయంలో మంగళవారం ఘన స్వాగతం లభించింది. గవర్నర్‌కు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ బీజేపీ పార్టీ నేతలతో కలసి ఘనంగా స్వాగతం పలికారు. గవర్నర్‌కు శ్రీకాళహస్తీశ్వర స్వామి శేష వస్త్రాలు సమర్పించి శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వర స్వామి చిత్రపటాన్ని బహుకరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం గవర్నర్ రోడ్డు మార్గంలో తిరుమల బయలుదేరి వెళ్లారు.

## అన్నప్రసాద భవనంలో కుళాయిలు మార్చండి

**-కల్యాణకట్టలో మరింత శుభ్రత అవసరం -టిటిడి ఈఓ శ్యామలరావు**

తిరుమల.జులై 23ప్రభాతవార్తప్రతినిధి: భక్తులు ప్రియంగా స్వీకరిసున్న అన్నప్రసాదాల నాణ్యత పెరిగిందని, రుచికరంగా ఉన్నాయని పలువురు భక్తులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. అన్నప్రసాద భవనాన్ని, కల్యాణకట్టకు మంగళ వారం సాయంత్రం టిటిడి ఈఓ శ్యామలరావు తనిఖీ చేశారు. ఇక్కడ భక్తులకు అందుతున్న సేవలు, నాణ్యతపై పరిశీలించారు. పలుచోట్ల నాణ్యతలేని ఎలక్ట్రికల్ స్విచ్‌బోర్డులు మార్చాలని, అన్నప్రసాద భవనంలో చేతులు కడుగుకునే కుళాయిలు మార్పుచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో టిటిడి జెఈఓలు వీరబ్రహ్మం, గౌతమి, డిప్యూటీ ఈఓ రాజేంద్ర, ప్రత్యేక అధికారి శాస్త్రి, ఎస్ఇ 2 జగదీశ్వర్‌రెడ్డి, సిపిఆర్‌ఓ డాక్టర్ తలారి రవి, పిఆర్‌ఓ నీలిమ,డిఇ ఎలక్ట్రికల్ రవిశంకర్‌రెడ్డి ఉన్నారు.



## చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

**-రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరిన ఎమ్మెల్యే పులివర్తి నాని**



తిరుపతిరూరల్, జులై 23 ప్రభాతవార్త: చంద్రగిరి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ వంతంగా తీర్చిదిద్దాలనే దృఢ సంకల్పంతో ఎమ్మెల్యే పులివర్తి నాని ముందడుగులు వేస్తున్నారు. నియోజకవర్గంలో వర్షాల వల్ల కొట్టుకుపోయిన బ్రిడ్జిలను నూతనంగా నిర్మించ టానికి నిధులు కేటాయించాలని సి.యంను ఎమ్మెల్యే నాని కోరారు. అసెంబ్లీ సమావేశం ముగిసిన అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును క్యాంప్ కార్యాలయంలో కలిసి చంద్రగిరి నియోజకవర్గంలో నెలకున్న పరిస్థితులను వివరించారు. 2022లో తుఫాన్ ప్రభావం వల్ల దెబ్బతిన్న తిరుచానూరు, తనపల్లి, చిగురువాడ, ఐతేపల్లి బ్రిడ్జిలను పున:నిర్మించాలని, నియోజకవర్గంలో మరమ్మతులకు గురైన రోడ్డులను బాగుచేయించాలని కోరారు. తలకోన బ్యాక్ వాటర్‌ని ప్రతి చెరువుకు అనుసంధానం చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. గత 25 సంవత్సరాల తర్వాత చంద్రగిరి నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరవేసిన తరుణంలో టిడిపి, ఎమ్మెల్యే నాని మార్కు ఉండేలా ఎమ్మెల్యే అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అభ్యర్ధనపై రాష్ట్ర ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. చంద్రగిరి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు సమాచారం.

## కంపెనీల సౌజన్యంతో అయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్

శ్రీకాళహస్తి, జులై 23 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పలు మండలాల్లో అయిల్‌ఫామ్‌గా మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌ను నిర్వహించుటకు మున్సిపల్ కమిషనర్లకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరధరామిరెడ్డితో సమీక్ష జరిపారు.జిల్లాలో 350 ఎకరాలలో అయిల్‌పామ్ సాగులో ఉన్నదని ఆయిల్ యాక్టు 1993 ప్రకారం,అయిల్ పామ్‌సాగు అయిల్ పామ్ మొక్కల సరఫరాదారులు, అయిల్‌పామ్ కొనుగోలు మరియు అయిల్ పామ్ ధరలు నిర్ణయించబడతాయని తిరుపతి జిలల్లాలో 27 మండలాలను ఐఐఓపిఆర్ సంస్థ ధృవీకరించిందని ఉద్యానవన శాఖ అధికారి వివరించారు.ఇక్కడ మొక్కలు పెంపకం బాద్యతను వివిధ కంపెనీలకు కేటాయించినట్లు పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో జిల్లాలో నాలుగు కంపెనీలు అయల్‌పామ్‌మీద పని చేస్తున్నాయని ప్రస్తుత సంవత్సరం మన జిల్లాకు 400 హెక్టార్లలో సాగు నిర్దేశించటం జరిగిందన్నారు. అయిల్‌పామ్ మొక్కలు నాటిన 4 సంవత్సరాల నుంచి దిగుబడి వస్తాయని తెలిపారు.గోద్రేజ్ కంపెనీ వడమాలపేట, కెవిబిపురం, శ్రీకాళహస్తి, సత్యవేడు, వరదయ్యపాళెం మండలాల్లో చెట్లు పెంపకానికి బాధ్యతను అప్పగించినట్లు తెలిపారు. 3ఎఫ్ కంపెనీ ఆర్‌సి పురం,ఏర్పేడు, తొట్టంబేడు, పుత్తూరు, పిచ్చాటూరు,బుచ్చినాయుడు కండ్రిగ, ఎ ఎం ఆర్ అగ్రోస్ నారాయణవనం, నాగలాపురం, సింహాపురి కంపెనీ నెల్లూరు జిల్లా నుంచి 14



మండలాలకు కేటాయించారు. ఒక హెక్టారుకి 143 మొక్కలు అవసరం అని మొక్కకు 100శాతం రాయితి ఇవ్వటం జరుగుతుందన్నారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న మొక్కలైతే హెక్టారుకు రూ.29వేలు,స్వదేశీ రకాలైతే హెక్టారుకు రూ.,20వేలు రాయితి ఉంటుంద న్నారు. ఇది కాకుండా ప్రతి సంవత్సరం నిర్వహణ ఖర్చుకు 5250లు ఇవ్వటం జరుగుతుం దన్నారు. అలాగే నాలుగు సంవత్సరాల వరకు అంతర్ పంటకు గాను రూ. 5250లు రాయితి ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్ సెప్టెంబర్ 15 వరకు జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 150 ఎకరాలకు రైతులను ఎంపిక చేసినట్లు ఉద్యానవన అధికారి దశరధరామిరెడ్డి పేర్కొన్నారు.

